# విలేఖరులు కావలెను



తెలుగు రాష్ట్రాల్లో అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా టుడే తెలంగాణ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లు కావలెను. అనుభవం ఆసక్తి గలవారు సంప్రదించండి

**98665 32777**

todaytelangananews6@gmail.com
www.todaytelangananews.com



TO-DAY TELANGANA
Telugu News Paper

# టుడే తెలంగాణ

తెలుగు దినపత్రిక నిజం మా నైజం


పంచాంగం - 11 ఫిబ్రవరి 2026 - బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం
ఉత్తరాయణం - శిశిర ఋతువు
మాఘ మాసం - కృష్ణపక్షం
సూర్యోదయం - ఉ. 6:48
సూర్యాస్తమయం - సా. 6:12
తిథి - అష్టమి ఉ. 7:27 వరకు
తరువాత నవమి
సంస్కృత వారం - భౌమ వాసరః
నక్షత్రం - విశాఖ ఉ. 7:49 వరకు
తరువాత అనురాధ
యోగం - ధ్రువ రా. 1:38ం వరకు
కరణం - కౌలవ ఉ. 7:27 వరకు, కౌలవ ఉ. 7:27 వరకు
వర్జ్యం - మ. 12:25 నుండి మ. 2:13 వరకు
దుర్ముహూర్తం - ఉ. 9:05 నుండి ఉ. 9:50 వరకు, రా. 11:14 నుండి రా. 12:04 వరకు
రాహుకాలం - మ. 3:21 నుండి సా. 4:46 వరకు
యమగండం - ఉ. 9:39 నుండి ఉ. 11:05 వరకు
గుళికాకాలం - మ. 12:30 నుండి మ. 1:55 వరకు
బ్రహ్మ ముహూర్తం - తె. 5:12 నుండి ఉ. 6:00 వరకు
అమృత ఘడియలు - రా. 11:11 నుండి రా. 12:59 వరకు
అభిజిత్ ముహూర్తం - మ. 12:07 నుండి మ. 12:53 వరకు


సంపుటి: 3 సంచిక: 133 www.todaytelangananews.com తెలంగాణ / ఆంధ్ర ప్రదేశ్ బుధవారం, ఫిబ్రవరి 11 2026 పేజీలు: 8 వెల: రూ. 5/-

Published from , Suryapet, Nalgonda, Khammam, Bhadradri Kothagudem, Hyderabad, Ranga reddy, Nizamabad, Adilabad ,


## తెలంగాణలో నేడు
# మున్సిపల్ ఎన్నికలు

- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్
- భారీగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసుల భద్రత
- మక్తల్ ఆరోవార్డు బిజెపి అభ్యర్థి ఆత్మహత్యతో ఎన్నిక వాయిదా




**హైదరాబాద్,ఫిబ్రవరి 10 :** తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరగ నున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే...నారాయణపేట్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆరోవార్డు ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవ్ ఆత్మహత్యతో ఎన్నికను రద్దు చేస్తున్నట్టు తెలిపింది. ఎన్నికలకు ఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు

మిగతా2లో...

## వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంలో
# ఎదురుదెబ్బ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 10 :** వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ నమోదు చేసిన అభియోగాలను సీబీఐ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుందని.. దానికి గల కారణాలు చెప్పలేదంటూ వాన్‌పిక్ యాజమాన్యం మిగతా2లో...

## అమరావతికి చట్టబద్ధతపై
# అమిత్‌షాతో చర్చ

నిధుల విడుదల కోసం నిర్మలా సీతారామన్‌తో భేటీ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 10 :** కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత వ్యవహారంపై ఆయనతో చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే పార్లమెంట్‌లో బిల్లు పెట్టా బడ్జెట్ రెండో దశ సమావేశాల్లో బిల్లు పెట్టాలని అమిత్ షాను సీఎం కోరినట్లు సమాచారం. దీంతో పాటు రాష్ట్రానికి చెందిన మరికొన్ని అంశాలపైనా కేంద్ర

మిగతా2లో...

## అక్రమంగా కృష్ణా నీటిని
# తరలిస్తున్న ఆంధ్రా

- చోద్యం చూస్తున్న సిఎం రేవంత్ రెడ్డి
- బాబుకు గురు దక్షిణ సమర్పిస్తున్నట్లుగా ఉంది
- మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు



**హైదరాబాద్,ఫిబ్రవరి 10 :** కృష్ణా నదీ జలాలను ఏపీ అప్పనంగా తీసుకుపో తున్నదని.. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని చోద్యం చూస్తున్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. తాను పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నానని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు అన్నారు. ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా నీళ్లను తీసుకుపోతున్నది. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కేఆర్ఎంబీకి రాసిన లేఖ ఇది. దీని ప్రకారం 664 టిఎంసీలు అంటే 80శాతం నీళ్లు ఏపీ వాడుకున్నది. ఇంతగా ఏపీ వినియోగిస్తుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నడని హరీష్ రావు ప్రశ్నించారు.


మిగతా2లో...

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

- నిధుల్లో కోత.. ఫెడరలిజంపై దాడే...
- సొమ్ములు మావి... గొప్పలు మీవా.?
- ప్రతిసారి మేమిచ్చాం, మేము తెచ్చాం కాదు
- అది తెలంగాణ ప్రజల సొమ్ము
- తెలంగాణ కేంద్రానికి ఇచ్చేది 1,33,208 కోట్లు...
- కేంద్ర పథకాలతో కలిపి ఇచ్చింది 51 వేల కోట్లు మాత్రమే
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం



**హైదరాబాద్,ఫిబ్రవరి 10** కేంద్ర ఆర్థిక విధానాల వల్ల దేశానికి అధికంగా ఆదాయం సమకూ రుస్తున్న దక్షిణాది రాష్ట్రాలు అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదు, రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. వికసిత్ భారత్ అనే నినాదం ఇస్తూ దేశ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని అన్నారు. 2018-19 నుంచి 2022-23 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అయితే, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు వచ్చాయన్నారు. మిగతా2లో...



## స్పీకర్ ఓంబిర్లాపై
# అవిశ్వాసం

- నోటీసులు ఇచ్చిన కాంగ్రెస్ తదితర పార్టీలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 10 :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేశారు. అవిశ్వాసం నోటీసులపై 119 మంది ఎంపీలు సంతకాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ ఎంపీలు మిగతా2లో...




## నేటి నుంచి ఎపి బడ్జెట్
# సమావేశాలు

- అధికారులతో స్పీకర్ అయ్యన్న సమీక్ష
- 14 బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థికమంత్రి

**అమరావతి,ఫిబ్రవరి 10 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11న బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10: 30కి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నజీర్ ప్రసంగించనున్నారు. సుమారు గంటసేపు స్పీచ్ ఉండే అవకాశం ఉంది. తరవాత 11: 30 గంటలకి మిగతా2లో...

## అమెరికా వాణిజ్య ఒప్పందం
# భారత్‌కు దెబ్బ


- మన వ్యవసాయాన్ని ముంచేయడం ఖాయం
- వస్త్ర పరిశ్రకు కూడా కోలుకోలేని నష్టం
- ఎక్స్ వేదికగా మల్లికార్జున ఖర్గే విమర్శలు




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 10 :** భారత్ అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పం దాన్ని కుదుర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఈ ఒప్పందం భారతదేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని, రైతులు, పశువులు, వస్త్ర రంగాన్ని బలహీనపరుస్తుందని ఆయన ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని ఆయన ప్రజా సంబంధాల ద్రోహంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 9న విడుదలైన వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ఫిబ్రవరి 6న భారత్- అమెరికా సంయుక్త ప్రకటనలో చేర్చని షరతులను వెల్లడించిందని ఖర్గే ఎత్తిచూపారు. రష్యా చమురు నిలిపివేయ డానికి భారత్ నిబద్ధతను ప్రదర్శిం చడం వల్లే అదనంగా 25 శాతం సుంకాల్ని తొలగించినట్లు అమెరికా ప్రకటన పేర్కొంది. ఇది భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమే నని ఖర్గే తీవ్రంగా విమర్శించారు. మిగతా2లో...

## పిఎంజిఎస్‌వై నిధుల మంజూరుకు కేంద్రానికి
# ప్రతిపాదనలు పంపండి

- సిఎస్ కె. రామకృష్ణా రావు



**హైదరాబాద్,ఫిబ్రవరి 10 :** ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన నాలుగవ దశలో భాగంగా రాష్ట్రంలో రోడ్ కనెక్టివిటి లేని 227 ఆవాసాల్లో 642 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నేడు డా. బీ.ఆర్. అంబేడ్కర్ సచివాలయంలో పీ.ఎం.జి.ఎస్.వై 4 వ దశ పనుల మంజూరుకై పంపే ప్రతిపాదనలపై రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ లతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, పీ.ఎం.జి.ఎస్.వై లో భాగంగా ఇప్పటి వరకు మూడు దశలలో రాష్ట్రానికి మంజూరైన రహదారులు, వంతెనల నిర్మాణ పనులను పూర్తి చేశామని, ఈ పథకం నాలుగవ దశ క్రింద రాష్ట్రంలో పక్కా రహదారులు లేని 227 ఆవాసాలల్లో 642.23 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అయితే, వీటిలో, 34 పనులకు మిగతా2లో...



## వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు
# సిఎంకు ఆహ్వానం

**హైదరాబాద్,ఫిబ్రవరి 10:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి మహా శివరాత్రి జాతర మహోత్సవానికి ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు. కలసి ఆహ్వాన పత్రిక అందచేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు-2026' ఆహ్వానం అందజేసారు. ఈ రెండు ప్రాంతాల్లో శివరాత్రి ఉత్సవాలు విశేషంగా జరుగుతాయి. అందువల్ల వీటికి హాజరు కావాలని మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ కోరారు.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

అయినప్పటికీ, ఈ స్థాయిలో ఆదాయం ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అని మంత్రి వ్యాఖ్యానించారు. పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని మంత్రి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి సగటున 30 పైసలు ఇస్తూ, ఇదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూ.1కి రూ.4 చొప్పున ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమతుల్యతను పెంచడమే కాకుండా, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారిందని మంత్రి ఆరోపించారు. కేంద్రం చెప్పుకునే వికసిత్ భారత్ విధానం అంటే ఇదేనా అని మంత్రి ప్రశ్నించారు. డిసెంబర్ లో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2024-25 లో తెలంగాణ రాష్ట్రం నుండి 1,33,208 కోట్ల పన్నులు వసూలు అయితే.. కేంద్రం నుండి రాష్ట్రానికి కేంద్ర పన్నుల రూపంలో 27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో 7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాల రూపంలో 16,762 కోట్లు మొత్తంగా 51,725 కోట్లు విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి సమాధానం చెప్పారని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 'పథకాల రూపంలో వచ్చిన నిధులను కూడా కలిపితేనే ఈ మొత్తం వస్తోంది. స్వేచ్ఛగా వినియోగించుకునే నిధులు మాత్రం మరింత తక్కువ' అని మంత్రి వివరించారు. జీఎస్టీ సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తెలిపారు. ఇక 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాల వారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కత్తెర పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇది కేవలం లెక్కల విషయం కాదు. ఇది కేంద్రంలో ఉన్న పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితం. బలమైన రాష్ట్రాలను బలహీనపరచి, ఆర్థికంగా ఆధారపడేలా చేయాలనే ఉద్దేశమే కనిపిస్తోందని తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలలో బిజెపి పార్టీ అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతోనే దక్షిణాది రాష్ట్రాలకు ముఖ్యంగా తాము అధికారంలో లేని రాష్ట్రాలకు తక్కువ నిధులు విడుదల చేసి, వారి కుంచిత స్వభావాన్ని చూపెడుతున్నారని అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలు భాగస్వాములే కాని, కేంద్రం దయాధర్మాలపై ఆధారపడేవి కావని మంత్రిగారు స్పష్టం చేశారు. దేశ సమగ్ర అభివృద్ధి సాధించాలన్న, కేంద్రం చెప్పుకుంటున్న వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా, అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలని, ముఖ్యంగా ఆదాయం సమకూర్చే రాష్ట్రాలపై వివక్ష మానుకోవాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి కోరారు. తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఎంపీలు మరియు కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడు ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తెచ్చాం, ఇన్ని చేశాం, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందనట్లు మాట్లాడటం వారి పతనానికి నాంది. ఈ విషయంలో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి నాయకులు కూడా తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటాకోసం కేంద్రంతో పోరాడటానికి మాతో కలిసి రావాలని మంత్రి కోరారు.

# అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్న ఆంధ్రా

(మొదటి పేజీ తరువాయి)

28 జనవరి నాడు తాత్కాలిక ఒప్పందం 66:34 ప్రకారం దాటి ఏపీ ఇప్పటికే 664 టీఎంసీలు వాడుకున్నదని హరీష్ రావు తెలిపారు. ఇంకా రెండు రోజుల్లో ఏపీ వినియోగం వాటా దాటుతుంది అని కేఆర్ఎంబీకి లేఖ రాసింది. వెంటనే బోర్డు మీటింగ్ పెట్టండి, ఏపీ నీటి దోపిడిని ఆపండి అని ఈఎన్సీ రాసిన లేఖలో ఉంది. 28న లేఖ రాసిందు, 31న ఈఎన్సీ రిటైర్ అయ్యారు. ఈఎన్సీ రిటైర్ అయిన తర్వాత వారం రోజుల దాకా పోస్టు నింపలేదు. లెక్కకు మించి నీళ్లు తీసుకుపోతుంటే మనకు ఈఎన్సీ పోస్టు నింపలేదు. వారం రోజుల తర్వాత మీడియా ప్రశ్నిస్తే పోస్టు నింపింది. బోర్డు మెంబర్ ఆయన. ఖాళీ పోస్టు ఎందుకు పెట్టారు. వాటా కుదరలేదా..? మాట కుదరలేదా.. ? వారం రోజులు ఎందుకు ఖాళీగా ఉంచారు.. రాష్ట్ర ప్రయోజనాలు ఈ ప్రభుత్వానికి పట్టదా.. ? అని హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్‌కు గురువు గారు ఉన్నరని భయం. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం కండ్లు మూసుకు ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. వేసవి వస్తున్నది, తెలంగాణకు నీటి అవసరాలు ఉన్నయి. పంటలకు, పారిశ్రామిక అవసరాలు ఉన్నాయన్నారు. తెలంగాణ అవసరాలు పట్టించుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా..? తాత్కాలికంగా అయినా మనం 34శాతం వినియోగించుకోవాలి కానీ వినియోగించుకున్నది 20 శాతం వాటా. మన రాష్ట్రానికి 174 టీఎంసీలు వాడుకునేది ఉన్నది. అయినా వినియోగించుకోరు. ఈ రోజుకు కూడా ఏపీ 1.5 టీఎంసీల నీళ్లు తీసుకుపోతున్నది. మన పంటలు ఏం కావాలె. మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి ఏం కావాలి. సర్కారు నడుపుతున్నరా..? సర్కస్ నడుపుతున్నరా..? అని ధ్వజమెత్తారు. అడగాల్సిన రేవంత్ రెడ్డి అడగడు, హక్కులు కాపాడాల్సిన కేఆర్ఎంబీ ఏపీని ప్రశ్నించదు. బీజేపీ ప్రభుత్వం చేతిలో కేఆర్ఎంబీ ఉన్నది. రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేసీఆర్ మీద పడి ఏడ్వడం తప్పిదే..నీళ్ల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి ఎందుకు మాట్లాడరు..? కేఆర్ఎంబీని ఎందుకు నిలదీయరన్నారు. అడ్డగోలుగా ఏపీకి నీళ్లు తరలిస్తూ తెలంగాణ రైతుల నోళ్లు కొడుతున్నరు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న బంధం ఏమిటి..? రేవంత్, కిషన్ రెడ్డి కలిసి తెలంగాణ గొంతు పిసుకుతారా..? చంద్రబాబు, రేవంత్ మధ్య ఫెవికాల్ బంధం ఉండొచ్చు కానీ రాష్ట్ర హక్కులను ఆంధ్రాకు ఎందుకు రాసిస్తున్నరని ప్రశ్నించిన హరీష్ రావు. బీజేపీ, కాంగ్రెస్ ఉద్దేశ్య పూర్వక నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. తక్షణమే స్పందించి ఏపీ నీళ్ల తరలింపును అడ్డుకోవాలని, క్యారీ ఫార్వర్డ్ విధానంలో పైనున్న శ్రీశైలంలో నీటిని ఆపి పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్‌కు దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కేంద్రాన్ని అడిగినప్పుడు రష్యా చమురును నిలిపివేస్తున్నట్లు తమకు చెప్పలేదని ఖర్గే అన్నారు. అయితే ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ట్వీట్ ద్వారా ప్రకటించాడు. రష్యన్ ఫెడరేషన్ చమురు కొనుగోలును నిలిపివేయడానికి భారతదేశ నిబద్ధతను అదనపు 25 శాతం సుంకాన్ని తొలగించడానికి ఒక షరతుగా జాబితా చేసినట్లు వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ స్పష్టంగా చెప్పింది. దీన్నిబట్టి చూస్తే భారతదేశ సార్వభౌమత్వాన్ని హరించడానికి మోడీ ప్రభుత్వం అంగీకరించింది ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. ఈ ఒప్పందం వల్ల భారతదేశ వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని ఖర్గే ఆందో ళన వ్యక్తం చేశారు. పప్పుధాన్యాలు, జన్యుపరంగా మార్పు చేసిన (జీఎం) ఫీడ్, ఎండిన డిస్టిలర్ల ధాన్యాలు (డిడిజిలు) అంటే మొక్కజొన్న, సోయా బీన్స్.. ఇక పశుగ్రాసం కోసం ఎర్రజొన్నలను కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకునేటట్టు సైలెంట్‌గా ఇందులో చేర్చారని ఖర్గే ఆరోపించారు. దీని ఫలితం రెండు కోట్ల రైతులు, పశువుల పెంపకం దారులు నష్టోపోవచ్చని ఖర్గే హెచ్చరించారు. భారతదేశ చరిత్రలో మొదటి సారిగా.. ఒక ప్రభుత్వం మన వ్యవసాయాన్ని విదేశీ వస్తువులకు తలుపులు పూర్తిగా తెరిచింది. ఈ ఒప్పందంలో అదనపు ఉత్పత్తులు అంటే.. అర్థం ఇదే. ఈ విషయం మనకు తెలుసు. ఫిబ్రవరి 9న కొత్తగా విడుదల చేసిన వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో 'పల్స్' అనే పదాన్ని సైలెంట్‌గా జోడించింది. అయితే ఫిబ్రవరి 6, 2026న జారీ చేసిన భారత్ ? అమెరికా సంయుక్త ప్రకటనలో ఇవి లేవు. మరోవైపు బంగ్లాదేశ్ అమెరికా పత్తి దిగు మతులకి సున్నా శాతమే పన్నులు విధించగా.. భార త్ 18 శాతం పన్నులు విధించడాన్ని ఖర్గే విమర్శి ంచారు. 18 శాతం పన్నులు విధించడాన్న పెద్ద విజయంగా మోడీ చెప్పుకుంటోందని ఖర్గే ఆరోపించారు. అమెరికా భారత రైతుల కంటే బంగ్లాదేశ్‌ను ప్రోత్సహించి.. తన సొంత లాభాలను కాపాడుకుంది. తిరుపూర్, సూరత్‌వంటి వస్త్ర కేంద్రాలు 18 శాతం పన్నుల పరిధిలోకి రావడంతో భారతీయ వస్త్ర రంగానికి డబుల్ దెబ్బ తగిలింది. జాతీయ ప్రయోజ నాలను, ఎగుమతి ఇంజిన్‌ను త్యాగం చేసే ప్రజా సంబంధాల ద్రోహమాఅని ఖర్గే ఎక్స్‌లో ప్రభుత్వాన్ని విమర్శించారు.

# తెలంగాణలో నేడు మున్సిపల్ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో తమకు కేటాయించిన బూతలకు చేరుకున్నారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో బుధవారం పోలింగ్ జరుగనున్నది. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ పక్రియ ప్రారంభంకా నున్నది. సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడికాను న్నాయి.. ఆ రోజే నగర, పట్టణ ప్రజానీకం ఎవరి వైపు మొగ్గు చూపిందనే ఉతంఠకు తెరపడనున్నది. జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు మంగళవారం తరలించారు. ఎన్నికల



సిబ్బంది ఇప్పటికే తమకు కేటాయించిన కేంద్రాలకు వాహనాల్లో వెళ్లారు. ఎన్నికలు జరిగే పురపాలికల్లో పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులు, పత్రాలను పోలీస్ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి రాష్ట్రంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు తరలించారు. అక్కడి నుంచి మంగళవారం ప్రతి పోలింగ్ కేంద్రానికి తరలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అకడ సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించారు. ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గు ర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. 11న జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పోలింగ్ పక్రియ కోసం సిబ్బంది నియామకం, వారికి అందించిన శిక్షణపై సమీక్షించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డిజపి కూడా పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

# నేటి నుంచి ఎపి బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

బీఏసీ సమావేశం జరగనుంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించి ప్రధానంగా చర్చిస్తారు. 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ఇక, ఈ నెల 14వ తేదీన 2026-27కి సంబంధించిన బ్జడెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వరుస సమావేశాలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు నిర్వహించే ఆటలు, సంస్కృతిక కార్యక్రమాలపై స్పీకర్ అయ్యన్న సమీక్ష చేశారు. సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, సభ్యుల ప్రశ్నలు, వాటికి సమాధానాలపై సమీక్షించారు. డీజీపీ సహా పోలీస్ ఉన్నతాధికారులతో స్పీకర్ అయ్యన్న కీలక సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాలకు కల్పించే భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

# స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం

(మొదటి పేజీ తరువాయి)

సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. అయితే ఇండియా కూటమిలోని కొన్ని పార్టీలు అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేసేందుకు ఒప్పుకోలేదు. ఈ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చేందుకు టీఎంసీ నిరాకరించింది. సభలో తాము మాట్లాడేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. భారత్-చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ తీరుపై ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి పూనుకుంది. సాధారణంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆ ప్రకారం బ్జడెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బ్జడెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13న ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

# వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేయడంతో వాన్‌పిక్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై జస్టిస్ సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీనిపై విచారణకు నిరాకరిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

# అమరావతికి చట్టబద్ధతపై అమిత్‌షాతో చర్చ

(మొదటి పేజీ తరువాయి)

హోంమంత్రితో సీఎం చంద్రబాబు చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, వివిధ ప్రాజెక్టులకు అనుమతులు తదితర అంశాలపై ఆమెతో చర్చించారు. సీఎం వెంట రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు ఉన్నారు.

# మహదేవప్ప మృతికి రేవంత్‌దే బాధ్యత

**• ఎన్నికల సంఘం విచారణ జరపాలి • రేవంత్ రెండేళ్లుగా ఏమీ చేయకుండా తనపై విమర్శలా • మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 10** మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి సీఎం రేవంత్ బాధ్యత వహించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు. అతను అర్థాంతరంగా ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్న దానిపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తలాతోకా లేకుండా రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ రెండేళ్లుగా మాటలతో కాలయాపన చేశారని.. ఏం చేస్తారో చేతల్లో చూపించాలన్నారు. ఇచ్చిన మాటపై నిలబడే శక్తి లేకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకపోతే తన పేరును మార్చి పిలుస్తున్నారని ఫైర్ అయ్యారు. 'మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోండి.. మాకు అభ్యంతరం లేదు. కానీ.. మా తల్లి పెట్టిన పేరు మార్చడానికి మీరెవరు? మాపై వ్యక్తిగత విమర్శలు సరికాదు. మీకు దెయ్యాలు.. దేవతల్లా కనపడవచ్చు. మజ్లిస్‌తో మీరు కాపురం చేసినన్నాళ్లూ.. మేం నిప్పులు పోస్తాం' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయలేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తాను ఎవ్వరికీ దత్తపుత్రుడ్ని కాదని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఏవైనా విభేదాలుంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలో లాగడం ఎందుకని ప్రశ్నించారు. తన గురించి తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేయకుండా కిషన్ రెడ్డి పేరు మారుస్తానని అంటున్నారని కేంద్ర మంత్రి మండి పడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం అడ్డురాకుండా చూసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ.. ఒక్క రోజూ కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లా డలేదని విమర్శించారు. తామెప్పుడూ బీఆర్ఎస్‌తో కలవలేదని తేల్చిచెప్పారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేశాయని గుర్తుచేశారు. ఇప్పుడేమీ చేయలేక తనపై ఆడి పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? కిషన్ రెడ్డిదా.? అనేది తెలంగాణ సమాజం ఆలోచించాలన్నారు.

# పిఎంజిపై నిధుల మంజూరుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపండి

(మొదటి పేజీ తరువాయి)

గాను 148 కిలోమీటర్లకు అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉందని, ఈ మార్గాల్లో బ్రిడ్జిల నిర్మాణ పనులకు సంబంధించి మరో వారం రోజుల్లో డీపీఆర్ లను పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాల్సిందే



**హైదరాబాద్, ఫిబ్రవరి 10:** రిటైర్డ్ ఉద్యోగులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. 'సీఎం గారూ... మీకు మానవత్వం ఉందా?' అని ప్రశ్నించారు. విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం న్యాయమా అని ప్రశ్నించారాయన. రిటైర్డ్ అయ్యి రెండేళ్లయినా.. వారి బకాయిలను ఇంకా చెల్లించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 61 మంది విశ్రాంత ఉద్యోగులు తనువు చాలించారని.. వారి చావులకు ఎవరు బాధ్యులని లేఖలో ప్రస్తావించారు.ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులను రాష్ట్ర సర్కార్ ప్రాధాన్యం లేని కేటగిరీలుగా భావిస్తోందా అని బండి సంజయ్ నిలదీశారు. ప్రభుత్వ తీరు తెలంగాణకు మాయని మచ్చ అని విమర్శించారు. జీవితం మలి సంధ్యలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిదన్నారు. ముక్కుమొహం తెలియని వృద్ధులు కష్టాల్లో ఉంటేనే చేతనైనంత సాయం చేయాలని భావించే గొప్ప మానవతా హృదయం ఉన్న తెలంగాణ సమాజం మనదని ఆయన చెప్పుకొచ్చారు.ఉద్యోగ విరమణ చేసిన వెంటనే వారికి బెనిఫిట్స్ అన్నింటినీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని కేంద్ర మంత్రి ఫైర్ అయ్యారు. దీనిని తక్షణమే అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని వారి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేసేందుకు వెనకాడబోమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ఓటుకు రూ.30 వేలు, గెలిస్తే అర తులం బంగారం మున్సిపల్ ఎన్నికల్లో ప్రలోభాల పర్వం




**హైదరాబాద్ :**ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు .. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చాలా ఖరీదుగా మారాయి అనేది అర్థం అవుతోంది. పార్టీలు, అభ్యర్థులు అని తేడా లేకుండా.. డబ్బు, మద్యం, మాంసం, బహుమతులు, బంగారం, వెండిని ఓటర్లకు పంచుతూ.. వారిని ప్రసన్నం చేసుకుంటున్నారు. ఖరీదైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో పోటీ చేస్తున్న అభ్యర్థులు.. ఎలాగైనా కౌన్సిలర్లుగా, కార్పొరేటర్లుగా గెలిచి.. ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్, మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.మరీ ముఖ్యంగా హైదరాబాద్ నగర శివార్లలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలో ఉన్న మున్సిపాలిటీల్లో ఓట్లను రాబట్టుకునేందుకు అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటుకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బిజినెస్ జోరుగా జరిగే పరిధిలో కౌన్సిలర్ పదవి కోసం అభ్యర్థులు కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నారు. అది చూసి ఓటర్లే కాకుండా యావత్ రాష్ట్ర ప్రజలు కూడా ఆశ్చర్యంలో మునిగిపోతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వింత పోకడలు.. పెళ్లిళ్లకు, పిల్లలు పుడితే ఆర్థిక సాయం.. బాండ్ పేపర్‌పై హామీలుఈసారి ఎన్నికల్లో ప్రలోభాలు డబ్బు, మద్యంతోపాటు.. రకరకాల హామీలు గుప్పిస్తున్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో పోటీ చేస్తున్న ఓ అభ్యర్థి ఇచ్చిన హామీ ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికల్లో తాను విజయం సాధిస్తే.. ఓటర్లకు అర తులం బంగారం ఉచితంగా ఇస్తానని బహిరంగంగానే ప్రకటించినట్లు సమాచారం. ఇక మరికొన్ని చోట్ల ఒక్కో ఓటుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు డబ్బులు పంపిణీ చేస్తున్నారు.ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం.. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎల్లుండే పోలింగ్‌వీటితో పాటు చికెన్, మటన్ విందులు, మద్యం పంపిణీతో ఓటర్లను తమకు ఓట్లు వేసేలా పురమాయించేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇవే కాకుండా ఇంట్లో అవసరమయ్యే వస్తువులను కూడా గిఫ్ట్‌ల రూపంలో అందిస్తున్నారు. టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఫ్రిజ్‌లు, రైస్ కుక్కర్లు, ప్రెజర్ కుక్కర్లు, మిక్సీలు, గ్రైండర్లను ఓటర్లకు ఇచ్చి వారిని తమకే ఓటు వేసేలా గాలం వేస్తున్నారు.అయితే ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలు లేకుండా ఓటర్లు స్వేచ్ఛగా ఓట్లు వేసేలా.. ఈ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అవేమీ లేకుండా దర్జాగా ప్రలోభాల పర్వం కొనసాగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా ఎన్నికల్లో డబ్బులు వెదజల్లి గెలిచిన అభ్యర్థులు.. పదవిలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు చేయకుండా ప్రభుత్వ సొమ్మును కొల్లగొడతారనే భయాలను విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.

# మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య - ఎన్నిక రద్దు చేసిన అధికారులు




**నారాయణపేట జిల్లా :**మక్తల్ పట్టణ కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 6వ వార్డు చందపూరులో బీజేపీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యకు పాల్పడ్డారు. 6వ వార్డు నుంచి గెలుపొందేందుకు మహదేవప్పకు ఎక్కువ అవకాశాలుండటంతో ఇతర పార్టీ నాయకులు బెదిరింపులకు గురి చేయడంతో భయభ్రాంతులకు లోనై ఉరి వేసుకొని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి మృతి కారణంగా ఆరో వార్డు ఎన్నిక రద్దు చేసినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.బెదిరింపులు, ఆరోపణలే : బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య ఘటనపై బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తమ అభ్యర్థి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల బెదిరింపులు, వేధింపులే ఈ ఘటనకు కారణమని ఆరోపించారు.కాంగ్రెస్ నాయకులు అరాచకాలు చేస్తున్నారు : మహదేవప్పది ఆత్మహత్య కాదు, కాంగ్రెస్ చేసిన హత్య అని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తమ సహనాన్ని పిరికితనంగా భావిస్తారా? అని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయని ధ్వజమెత్తారు. కార్యకర్తలారా ధైర్యంగా ఉండండి, నాయకత్వం అండగా ఉందని తెలిపారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి : బీజేపీ ఎంపీ డి.కె.అరుణ మహదేవప్ప కుటుంబసభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. మహదేవప్ప ఆత్మహత్య ఘటనను రాజ్యసభలో ప్రస్తావించినట్లు ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. కాంగ్రెస్ ఒత్తిడితో ఎస్టీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం దారుణమని అన్నారు. ఈ ఘటనను కేంద్రప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహదేవప్ప ఆత్మహత్యపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని అన్నారు. తోపులాటలో కిందపడిన డీసీపీ : మక్తల్?లో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యకు కాంగ్రెస్ కారణమంటూ బీజేపీ నాయకులు హైదరాబాద్‌లోని డీజేపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేపీ శ్రేణులకు మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ తోపులాటలో ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి కిందపడిపోయారు. పలువురు పోలీసులు, బీజేపీ కార్యకర్తలకు గాయాలు అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు.ఫిర్యాదు వచ్చింది : మక్తల్ బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు వచ్చిందని డీజీపీ శివధర్? రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మహదేవప్ప ఎటువంటి ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసిందని చెప్పారు.

# హీరోయిజం చూపిస్తే కఠిన చర్యలు తప్పవు సీపీ సజ్జనార్ హెచ్చరిక




**హైదరాబాద్, ఫిబ్రవరి 10:** బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న యువతకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. నగరంలో యువకులు బైక్‌పై చేస్తున్న ప్రమాదకర విన్యాసాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో సీపీ.. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. వాహనాలను బాధ్యతాయుతంగా నడపాలని సూచించారు. బైక్ మీద చేసే ఈ చిత్రవిచిత్రమైన విన్యాసాలు చూడటానికి థ్రిల్లింగ్‌గా అనిపించవచ్చుని.. కానీ అవి క్షణాల్లో ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడతాయని ఆయన హెచ్చరించారు. బైక్ మీద చేసే విన్యాసం.. నూరేళ్ల ఆయుష్షుకు వినాశనం అంటూ ఆయన పేర్కొన్నారు.చిన్న ప్రమాదం జరిగినా జీవితాంతం మంచానపడాల్సి వస్తుందని సీపీ అన్నారు. అంతేకాకుండా, మీ వల్ల ఇతరులు కూడా ప్రమాదాలబారిన పడొచ్చని తెలిపారు. సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం.. రోడ్డు మీద హీరోయిజం చూపించాలనే ఆశతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సజ్జనార్ సూచించారు. బైక్‌పై స్టంట్లు చేస్తూ వెనుక కూర్చున్న వ్యక్తుల ప్రాణాలను కూడా రిస్క్‌లో పెడుతున్న ఈ చర్యలు చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వాటి వల్ల కేసుల పాలై సమస్యలను కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. 'బాధ్యతగా డ్రైవ్ చేయండి' అంటూ సీపీ సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# అనిరుధ్ రెడ్డికి మతిస్థిమితం లేదు ఎమ్మెల్యే ఎలా అయ్యారో అర్థం కావట్లేదు



**హైదరాబాద్, ఫిబ్రవరి 10:**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జడ్చర్ల ఎమ్మెల్యే అనురుధ్ రెడ్డి మరోసారి తీవ్రస్థాయిలో ఫైరయిన విషయం తెలిసిందే. పవన్ పెద్ద ఈగోయిస్ట్ అని.. తిరుమల తిరుపతి దేవస్థానం డబ్బులను కొండగట్టు పుణ్యక్షేత్రానికి ఇచ్చి తన డబ్బులు ఇచ్చినట్లు డబ్బా కొట్టుకుంటున్నాడని విమర్శించారు. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు రావని తెలిసే ప్లాన్ ప్రకారం తన ప్రచార షెడ్యూల్ క్యాన్సిల్ చేసుకున్నారని సెటైర్లు పేల్చారు. ఈ కామెంట్లపై తాజాగా.. సినీ నటుడు, జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్ స్పందించారు. అనిరుధ్ రెడ్డి మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నాడని కౌంటర్ ఇచ్చారు. దేశంలో ఎక్కడైనా రాజకీయాలు చేసే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని.. ఆ మాత్రం తెలియకుండా అనిరుధ్ రెడ్డి ఎలా ఎమ్మెల్యే అయ్యాడో అర్థం కావట్లేదన్నారు.'అనిరుధ్ రెడ్డి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు. అసలు ఈయన ఎమ్మెల్యే ఎలా అయ్యారో కూడా అర్థం కావట్లేదు. తెలంగాణలోనే పుట్టి పెరిగి.. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే జనసేన అభ్యర్థుల గురించి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. అసలు మీకు సిగ్గుందా..? ఎక్కడో ఇటలీలో పుట్టిన సోనియా నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ తరఫున మీరు పోటీ చేస్తున్నారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం తెలియకుండానే ఎమ్మెల్యే అయిపోయారు. ఎవరు ఎక్కడినుంచైనా పోటీ చేయవచ్చుననే హక్కు తెలియకుండానే ఎమ్మెల్యే అయ్యారుపవన్ కల్యాణ్ గురించి మాట్లాడే అర్హత నీకుందా..? నీ జీవితంలో ఎప్పుడైనా నీ పాకెట్ మనీ తీసి నీ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చావా..? పవన్ గారు పదవిలో ఉన్నా.. లేకపోయినా.. కుటుంబాన్ని పక్కన పెట్టి మరీ సొంత డబ్బులు ఖర్చు పెడుతున్నారు. అలాంటి వ్యక్తిని పట్టుకొని పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతావా..? దేశ ప్రధానిని పట్టుకొని పిచ్చి పిచ్చి మాటలా..? నిన్ను ఎన్నుకున్న ప్రజల సంక్షేమం కోసం మాట్లాడు. వారి కోసం శ్రమించు. అంతే కానీ ఇలా పిచ్చి పిచ్చిగా మాట్లాడకు. నీ వల్ల మిగతా ఎమ్మెల్యేలకు చెడ్డ పేరు వస్తుంది. ఇక నుంచి ఇలాంటి మాటలు మాట్లాడితే పక్క పార్టీలు వాళ్లు కాదు సొంత పార్టీ వాళ్లే ఇంటికి వచ్చి మరీ కొడతారు. గుర్తుపెట్టుకో మిస్టర్ అనిరుధ్ రెడ్డి' అంటూ ఆర్కే సాగర్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కాగా, ఈ కామెంట్లకు అనిరుధ్ రెడ్డి ఎలా స్పందిస్తారనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. అధికారం అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. తాజాగా జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కాన్వాయ్‌తో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హల్‌చల్ చేశారు. దీంతో ఎన్నికల సంఘం మంత్రిపై కేసు నమోదు చేసింది. మరోవైపు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా గద్వాల పట్టణంలో మంగళవారం ఉదయం నుంచి వార్డుల్లో పర్యటించారు.అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో మీటింగ్ లు నిర్వహిస్తున్నారు. ఓటమి భయంతో ఎమ్మెల్యే, అధికార పార్టీ నాయకులు నిబంధనలు అతిక్రమించి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా చోద్యం చూడకుండా చర్యలు తీసుకోవాలని గద్వాల్ పట్టణంలోని ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు.

# రూ.700 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా




**హైదరాబాద్, ఫిబ్రవరి 10:** నగరంలో భూ ఆక్రమణలపై హైడ్రా దూకుడు కొనసాగుతోంది. గచ్చిబౌలి – కొండాపూర్ ప్రాంతాల్లో సుమారు రూ. 700 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి రక్షించింది. కొండాపూర్‌లోని జంగంకుంట ఆక్రమణలపై హైడ్రా అధికారులు సీరియస్ అయ్యారు. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మదీనగూడ మజీద్ బండ వద్ద హైడ్రా ఆపరేషన్ మొదలుపెట్టింది. సుమారు 4 ఎకరాల జంగంకుంటను ఆక్రమణదారులు మాయం చేసినట్లు అధికారులు గుర్తించారు. కబ్జాదారులు సర్వే నంబర్ 134లో మట్టి పోసి కుంటను చదును చేశారు.ఈ భూమిని ప్లాట్లుగా విభజించి అమ్మకానికి సిద్ధమయ్యారు. ఈ ఆక్రమణలపై ఇప్పటికే రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేశారు. జంగంకుంటలో రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా టీం.. జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించింది. పోలీసుల సహకారంతో హైడ్రా సిబ్బంది.. కుంట చుట్టూ ఫెన్సింగ్ వేస్తోంది. కాగా, హైదరాబాద్‌లో ప్రకృతి వనరులు, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు 2024లో హైడ్రా ఏర్పాటైంది. భూమి ఆక్రమణలు, చెరువులు, కుంటల రక్షణ, విపత్తు నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పటివరకు వేలాది ఎకరాల భూమిని రికవరీ చేసి, అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. ఇటీవల హైడ్రా.. నిర్మాణాలను కూల్చివేయడమే కాకుండా, తవ్వకాలు కూడా చేపట్టిన విషయం తెలిసిందే.

# మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి




**నల్లగొండ, ఫిబ్రవరి 10 :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాంలో ఏర్పాటు చేసిన నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని తనిఖీ చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందుగా సిబ్బందితో మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని, అన్ని విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్, బ్యాలెట్ పేపర్ అకౌంట్, పిఓ డైరీ జాగ్రత్తగా రాయాలన్నారు. పోలింగ్ రోజున ఉదయం 6:45 గంటలకు ఏజెంట్ల ఎదురుగా బ్యాలెట్ బాక్స్ ను తెరవడం చేయాలన్నారు.ఓటు హక్కు వినియోగించుకోనున్న 3,09,097 మందిఅనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఈ నెల 11న నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, జిల్లాలోని 6 మున్సిపాలిటీలకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, 161 వార్డులకు సంబంధించి 473 పోలింగ్ కేంద్రాలలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనుందని, హాలియా మున్సిపాలిటీలోని 10వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం అయినందున అక్కడ ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. 3 లక్షల 9 వేల 97 మంది ఓటర్లు మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఇందుకుగాను ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని, ఓటరు చీటీలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సవ్యంగా నిర్వహించేందుకు సిబ్బందిని నియమించడంతో పాటు, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం జరిగిందని, డీఆర్సీ కేంద్రాల ద్వారా పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలుమున్సిపల్ ఎన్నికలకు 2,855 మంది సిబ్బంది సేవలను వినియోగించుకోవడం జరుగుతున్నదని, వీరందరికీ శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు.

# మన్నె లక్ష్మీనర్సయ్యకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి



**అర్వపల్లి, ఫిబ్రవరి 10 :** బీఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా సీనియర్ నాయకుడు, కుంచమర్తి గ్రామ మాజీ సర్పంచ్ మన్నె లక్ష్మీనర్సయ్య యాదవ్ సోమవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. ఆయన భౌతిక కాయానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్, నాగారం సర్పంచ్ గుంటకండ్ల రామచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుండగాని సోమేష్ గౌడ్, మాజీ జడ్పీటీసీలు దావుల వీరప్రసాద్ యాదవ్, జీడి భిక్షశీ, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, ప్రభు, రాశీకోటి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

TO-DAY TELANGANA Telugu News Paper
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# నా జన్మలో ఇదో అద్భుత ఘట్టం




**తిరుమల, ఫిబ్రవరి 10:** ప్రముఖ తెలుగు సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్(కాలినడకన తిరుమలకు చేపట్టిన 'సంకల్ప యాత్ర' విజయవంతంగా పూర్తైంది. షాద్‌నగర్ నుంచి గత నెల 19న ఈ యాత్ర ప్రారంభమైంది. దాదాపు 23 రోజుల తర్వాత (మంగళవారం) తిరుమలకు సినీ నిర్మాత చేరుకున్నారు. సుమారు 540 కిలోమీటర్ల మేర పాదయాత్రగా వెళ్లి తిరుమలకు చేరుకున్నారు బండ్ల గణేశ్. (బుధవారం) ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆయన దర్శించుకోనున్నారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన బండ్ల గణేశ్.. తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. యాత్రను పూర్తి చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. స్వామివారి ఆశీర్వాదంతో ఏ ఆటంకం లేకుండా 23 రోజుల్లో తిరుమలకు చేరుకున్నానన్నారు. 'నా జన్మలో ఇదో అద్భుత ఘట్టం. స్వామి వారిని నమ్ముకుని ఎవరూ నష్టపోలేదు' అని గణేశ్ చెప్పారు. ఈ జన్మాంతం స్వామి వారికి రుణపడి ఉంటానని.. శ్రీవారి సేవ చేసుకుంటానని బండ్ల గణేశ్ భక్తిభావంతో అన్నారు.కాగా.. ఈ రోజు ఉదయం అలిపిరి చేరుకున్న బండ్ల గణేశ్.. అక్కడ పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో టీడీపీ కీలక నేతలు పాల్గొన్నారు. ఆ తర్వాత అలిపిరి నుంచి తిరుమలకు వెళ్లనున్నారు.

# మహాశివరాత్రికి 618 బస్సుల ఏర్పాటు

**వాటిల్లోనూ మహిళలకు ఉచితం**

**జిల్లా ప్రజా రవాణా అధికారి అజిత కుమారి**



**నరసరావుపేట(అమరావతి):** మహాశివరాత్రి సందర్భంగా పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల నుంచి కోటప్పకొండకు వచ్చే భక్తుల సౌక ర్యార్థం 618 బస్సులు ఏర్పాటు చేస్తున్నామని డీపీటీవో టీ అజిత కుమారి తెలిపారు. సోమవారం నరస రావుపేటలోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఆమె విలేకరు లతో మాట్లాడారు. ప్రత్యేక బస్సుల్లోనూ స్త్రీ శక్తి పథకం అమలవుతుందని వివరిం చారు. కోటప్పకొండ దిగువ నుంచి పైకి భక్తులను చేరవేసేందుకు 95 బస్సులు ఏర్పాటు చేశామన్నారు.దీంతో పాటు నరసరావుపేట బస్టాండ్ నుంచి 213, చిలకలూరిపేట నుంచి 121, వినుకొండ నుంచి 50, అద్దంకి నుంచి 39, చీరాల నుంచి 50, ఒంగోలు నుంచి 50 బస్సులను సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. అలాగే నరసరావుపేట డిపో పరిధిలో 1800 మంది, చిలకలూరిపేట డిపో పరిధిలో 750 మంది ఉద్యోగులు పనిచేస్తారన్నారు. కోటప్పకొండ, చిలకలూరి పేట, నరసరావుపేటలలో మొత్తం ఆరు ప్రత్యేక బస్‌స్టేషన్లు నిర్వహిస్తున్నామన్నారు. కోటప్పకొండ ఎగువకు, దిగువకు రాక పోకలు సాగించే బస్సులోనూ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఏడాది కోటప్పకొండ నుంచి నరసరావుపేటకు తిరుగు ప్రయాణంలో బస్‌స్టేషన్‌ను పెట్లూరివారిపాలెం రోడ్డు మార్గంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా నరసరావుపేట నుంచి కొండ వరకు రూ. 30లు, కొండ దిగువ నుంచి పైకి రూ. 25లు ఛార్జీలు వసూలు చేస్తామని చెప్పారు.

# శివరాత్రి నాటికి ఆలయాల్లో పటిష్ఠ చర్యలు తీసుకోండి



**అమరావతి, ఫిబ్రవరి 10:** శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో భక్తుల రద్దీ, వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళ వారం) సమీక్ష నిర్వహించారు. శివారాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, సౌకర్యాలపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు ఇతర అధికారులతో ఢిల్లీ నుంచి సీఎం సమీక్షించారు. శివరాత్రి నాటికి ఆలయంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు.రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి అనిత.. ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సీఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా.. సరైన వసతి లభించేలా కార్యచరణ అమలు చేయాలని ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, అగౌరవపరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని స్పష్టం చేశారు.రోజు రోజుకూ దేవాలయాల్లో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు. శివరాత్రి పర్వదినం వంటి సందర్భాల్లో అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# పాల వ్యాన్‌లో రేషన్ బియ్యం తరలింపు కేసు నమోదు



**తిరుపతి, ఫిబ్రవరి 10:** రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముఠా గుట్టును తిరుపతి పోలీసులు రట్టు చేశారు. చంద్రగిరి మండలం గాదంకి టోల్ ప్లాజా వద్ద మంగళవారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో.. పాల వ్యాన్‌లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి వ్యాన్ డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. తిరుపతి నుంచి కర్ణాటకకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. బియ్యంతో సహా వాహనాన్నీ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం సుమారు 5 టన్నులు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ వ్యవహారం వెనుక ఉన్నవారిని పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. అయితే.. తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి ఎర్రచందనం, కలప తదితర వస్తువులను అక్రమంగా పెద్దఎత్తున తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు కీలక ప్రాంతాలు సహా రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు.

# కేంద్ర మంత్రి సీఆర్‌పాటిల్‌తో సీఎం చంద్రబాబు భేటీ పోలవరంపై ప్రధానంగా చర్చ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ) సీఎం సమావేశమయ్యారు. ఏపీలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థిక సాయం, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్, తాగునీటి భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని సీఎం వివరించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా సవివరంగా చర్చించారు ముఖ్యమంత్రి.సీఎం చంద్రబాబు ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను(ఎస్‌డబ్ల్యూవో) శాశ్వతంగా ఎత్తివేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. అలాగే ఫేజ్-××  పనులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫేజ్‌లో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని, దీనికి అదనంగా సుమారు రూ.32,000 కోట్ల నిధులు అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు. గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో ప్రతిపాదిత పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపైనా చర్చ జరిగింది. తాగు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టుగా చెప్పుకొచ్చారు సీఎం. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా దీనికి అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదం పరిష్కారించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యుడీటీ) తుది నివేదికను వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని, దీని ఆధారంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని ముఖ్యమంత్రి విన్నవించారు.గోదావరి జలాల పంపకంపై ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య కొనసాగుతున్న వివాదంపై కూడా చర్చించారు. ఈ వివాదం పరిష్కారం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు సీఎం. ఎగువ కృష్ణాపై కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు చేపట్టిన చర్యలపై సీఎం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ ఎంపీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మిర్చియార్డు నూతన పాలకవర్గం నియామకం

**చైర్మన్‌గా కుర్రా అప్పారావు**

**అధికారికంగా వెలువడిన ఉత్తర్వులు**

**20న ప్రమాణ స్వీకారం**



**గుంటూరు:** గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు) నూతన పాలకవర్గం నియామకం పూర్తి అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదంతో రాష్ట్ర వ్యవసాయ, సహకార(మార్కెటింగ్) శాఖ సోమవారం అధికారికంగా జీవో నంబరు 89ని విడుదల చేసింది. కమిటీకి గౌరవ చెర్‌పర్సన్‌గా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, చైర్మన్‌గా కుర్రా అప్పారావు, వైస్ చైర్‌పర్సన్‌గా బిట్రగుంట మల్లికని నియమించింది. సభ్యులుగా కొనకళ్ల వెంకట సత్యన్నారాయణ, ముడావత్ మంగాబాయి,మొహమ్మద్ హాఫీజ్, మేళం సైదయ్య, షేక్ ఖాదర్ బీ, బత్తుల జాన్ సైదా, దర్శనపు విజయమ్మ, ఇమ్మడి వెంకటలక్ష్మి, డాకుమళ్ల భాగ్యారావు, కుత్తూరు శ్రావణ కుమారి, కటకంశెట్టి విజయలక్ష్మి, చంద్రగిరిబాబు, నక్కల వంశీకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, పశు సంవర్ధక శాఖ ఏడీ, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ పదవీకాలాన్ని ప్రాథమికంగా ఏడాది పాటు పేర్కొంటూ మార్కెటింగ్ శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.20న ప్రమాణ స్వీకారంమిర్చియార్డు పాలకవర్గం నియామకానికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలవడిన నేపథ్యంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించాలని చైర్మన్‌గా నియామకం పొందిన కుర్రా అప్పారావు నిర్ణయించారు. ఈ నెల 20న గుంటూరు పశ్చిమ నియోజక వర్గంలోని చేబ్రోలు హనుమయ్య గ్రౌండ్స్‌లో భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. ఇందుకోసం భారీగా ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు. ఎన్‌డీఏ కూటమి ఐక్యతని చాటి చెప్పేలా మిర్చి యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుందని మూడు పార్టీల నేతలు తెలిపారు. కమిటీలో దామాషా ప్రకారం తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులకు పదవులు కేటాయించారు. చైర్మన్ సీటుని తెలుగుదేశం పార్టీకి కేటాయించగా వైస్ చైర్‌పర్సన్ పదవిని జనసేనకు ఇచ్చారు. అలానే డైరెక్టర్ పదవుల్లో బీజేపీకి సముచిత స్థానం కల్పించారు. ఈ నేపథ్యంలో ప్రమాణ స్వీకారం రోజున భారీ ఎత్తున ర్యాలీలు కూడా గుంటూరు నగరంలో నిర్వహించనున్నారు.

# ఏపీలో కొత్తగా నాలుగు వరుసల రైల్వే లైన్‌లు




**అమరావతి, ఫిబ్రవరి 10:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రైల్వే ప్రాజెక్టులు, హైవేలపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో సరకు రవాణాను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు రైల్వే లైన్లను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రూట్‌లో రైల్వే లైన్లు 4 వరుసలకు పెరిగితే రవాణా మరింత వేగవంతం అవుతుందన్నారు. అయితే ప్రస్తుతం విజయవాడ నెల్లూరు మధ్య మూడో రైల్వే లైన్ పూర్తి చేశారు. చంద్రబాబు అమరావతిలో మంత్రులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలో 774 ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తి చేస్తే రైల్వే లెవెల్ క్రాసింగ్స్ సమస్య ఉండవు అన్నారు. కేంద్రం చేపట్టే రైల్వే ప్రాజెక్టులు, నేషనల్ హైవేలకు నిధుల విషయంలో ఇబ్బంది ఉండదని.. కానీ కలెక్టర్లు మాత్రం భూసేకరణపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాలని సూచించారు. కలెక్టర్లు గడువులోగా భూములు సేకరించేలా చూడాలన్నారు.కేంద్రం బుల్లెట్ రైళ్ల కారిడార్‌లను ప్రకటించిందని.. హైదరాబాద్ టు బెంగళూరు, హైదరాబాద్ టు చెన్నై వయా అమరావతి, చెన్నై టు బెంగళూరు రూట్లలోని కారిడార్లతో ఏపీకి ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ మూడు రూట్లలో బుల్లెట్ రైళ్లు ఏపీ మీదుగా వెళతాయన్నారు. రాష్ట్రంలో సరుకు రవాణా కూడా చాల కీలకమని.. అందుకే రైల్వే ప్రాజెక్టులు, నేషనల్ హైవేలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్రం నుంచి పంటలు రవాణా దేశ, విదేశాలకు చేసేందుకు లాజిస్టిక్స్ సదుపాయం ఉండాలన్నారు. ఇప్పటికే అనంతపురం జిల్లా నుంచి అరటిని రైళ్ల ద్వారా రవాణా చేస్తున్న విషయాన్ని చంద్రబాబు ప్రస్తావించారు.'రూ. 1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు చేశాం..మరో రూ. 3 వేల కోట్లు ఖర్చు చేసి రోడ్లను నిర్మిస్తున్నాం. పల్లె పండుగ ద్వారా రూ. 4 వేల కోట్లు ఖర్చు పెట్టి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం. జీ రామ్ జీ పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎం ఈ పార్కులు పెడుతున్నాం. రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. జల్ జీవన్ మిషన్ పథకాన్ని గతంలో అస్తవ్యస్తం చేశారు. దాన్ని సరిదిద్ది రూ. 25 వేల కోట్లతో ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు ఇస్తాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ కేర్ నిర్వహించాలని నిర్ణయించాం. యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ ద్వారా రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ ఉచితంగా ఆరోగ్య భీమా కల్పిస్తున్నాం' అన్నారు చంద్రబాబు.'పోలవరం ప్రాజెక్టును 2027 పుష్కరాల నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. రూ. 440 కోట్లతో కట్టిన డయాఫ్రమ్ వాల్ ను గత పాలకులు ధ్వంసం చేశారు. ఇప్పుడు అదనంగా రూ. 1000 కోట్ల మేర దాని నిర్మాణానికి ఖర్చు అవుతోంది. అమరావతి రాజధానిని శ్మశానమని, ఎడారని అన్నారు. వచ్చే మూడేళ్లలో మోస్ట్ లివబుల్ సిటీగా మారుస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహకారం అందించటంతో విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో పడింది. అంతా టీమ్ స్పిరిట్ తో పని చేయాలి. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు ఇచ్చే విధంగా ముందుకు వెళ్లాలి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు పాలనలో రావాలని అందరినీ కోరుతున్నాను. అవుట్ డేటెడ్, అవసరం లేని చట్టాలను సమీక్షించుకుని ముందుకు వెళ్దాం. మెరుగైన ఫలితాలు సాధించడానికి లక్ష్యాలు నిర్దేశించుకుని అంతా కలిసి పని చేద్దాం. 2026-27లో అనుకున్న లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ ఉండాలి' అని దిశా నిర్దేశం చేశారు ముఖ్యమంత్రి.

# నియోజకవర్గానికి ఫస్ట్ ర్యాంక్ సుజనా చౌదరి రియాక్షన్



**విజయవాడ, ఫిబ్రవరి 10:** తన నియోజకవర్గంలో 'నో దందా, నో చందా' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి చెప్పారు. తన నియోజకవర్గానికి ఫస్ట్ ర్యాంక్ రావడం ఆనందంగా ఉందన్నారు. మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి ఫస్ట్ ర్యాంక్ రావడంపై ఎమ్మెల్యే సుజనా చౌదరి మంగళవారం స్పందించారు. ఈ నియోజకవర్గానికి తాను చేసింది తక్కువే అని.. చేయాల్సింది ఎక్కువే ఉందని తెలిపారు.నియోజకవర్గంలో చందా.. దందా లేకుండా దాదాపుగా నియంత్రించామని విశ్వాసం వ్యక్తం చేశారు. ర్యాంకింగ్ అనేది ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అమలయ్యాయనే దాని మీద ఇచ్చారని ఎమ్మెల్యే సుజనా చౌదరి వివరించారు. ఎమ్మెల్యేగా తనకు కూడా ఫస్ట్ టైమ్ అని.. అలాగే నియోజకవర్గ ప్రజలంతా తనకు సహకరించారని సంతోషం వ్యక్తం చేశారు. కూటమిలోని మూడు పార్టీల వారు కలిసి పని చేశారని తెలిపారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. తొలిసారిగా ఈ నియోజకవర్గంలో పర్యటించానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి గుర్తు చేశారు. ఆ తర్వాత నిరంతరం నియోజకవర్గంలో పర్యటిస్తూనే ఉన్నానని వివరించారు. ఈ నియోజకవర్గంలో తాను చేసింది 25 శాతం లేదా 30 శాతం మాత్రమేనని.. ఇంకా చేయాల్సింది 75 శాతం మిగిలి ఉందన్నారు. ఆ దిశగా పని చేస్తున్నట్లు తెలిపారు. ?ఎమ్మెల్యేగా అన్నీ మనమే చేయలేమని.. డెలిగేట్ ద్వారా పని చేయించగలమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అనుసంధానం చేయడానికి ఎంత వీలు అయితే అంత చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఉన్న పథకాలు తీసుకొని.. ఇంకా చాలా వరకు మెరుగు పరిచామని వివరించారు.స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు ఏ విధంగా పెంచాలనే దిశగా ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా తన ఫోకస్ ప్రివెంటివ్ సిక్నెస్ మీదనేనని చెప్పారు. ఆ ?తర్వాత ప్రెగ్నెంట్ ఉమెన్.. పని మానేసి హాస్పిటల్స్ వెళ్లకుండా మెటర్నిటీ సెంటర్స్ పెడితే ఇంకా ఈజీగా ఉంటుందని చెప్పారు. దీంతో పాటు పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కోసం.. ఎన్జీవోస్‌తో మాట్లాడి ఐవోటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటివి ప్రవేశపెడతామన్నారు. ఆ తర్వాత మొబైల్ హెల్త్ వ్యాన్స్ పెట్టామని తెలిపారు. వీలైనంత వరకు తాను సుజనా ఫౌండేషన్ వారితో మాట్లాడానన్నారు. అందుకు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, భాగ్యనగర్ గ్యాస్ తదితర సంస్థలు సహకరించాయన్నారు. మిగిలిన ఫార్మా కంపెనీలతో కూడా తాను కాంటాక్ట్ చేస్తూ ఉన్నానని చెప్పారు.ప్రజల సమస్యలపై అందుబాటులో ఉండటం కోసం 'సుజనా మిత్ర' పేరుతో ప్రతి డివిజన్‌లో ఒక కార్యాలయం ఏర్పాటు చేసి.. సిబ్బందిని నియమించామని వివరించారు. నేతల ఎంతా, మత, ప్రాంతాలకు అతీతంగా పని చేస్తున్నారని చెప్పారు.

# ఏపీ ప్రజలకు మరో షాక్ ఆ భూముల్ని రిజిస్ట్రేషన్ చేయరు

**అమరావతి, ఫిబ్రవరి 10:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏపీ 1908 రిజిస్ట్రేషన్ చట్టం అమలులో ఉండగా.. అయితే సెక్షన్ 22ఏకు సంబంధించిన భూములు ఉన్నాయి. అయితే భూముల్ని ఫ్రీహోల్డ్‌గా మార్చడంతో పాటుగా భూ ఆక్రమణలకు సంబంధించిన అంశాలపై విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ విచారణకు సంబంధించిన గడువును మరోసారి పొడిగించారు.. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ మరో నెల పాటూ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ భూములకు సంబంధించి విచారణ కోసం గతంలో మూడు నెలల గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ కాలపరిమితి ఈ నెల 9తో ముగిసింది.. కానీ ఇప్పటికీ ఆ భూములకు సంబంధించిన విచారణ ముగించలేదు. అంతేకాదు దీనికి సంబంధించిన నివేదికలు కూడా సమర్పించలేదు. ఈ క్రమంలోనే మరోసారి నెల పాటూ విచారణ గడువు పొడిగించారు. ఇంతకుముందే అలాంటి భూముల రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. గతంలోనే ఈ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన పత్రాలకు క్రమసంఖ్య కేటాయించవద్దని ఆదేశించారు. తాజాగా విచారణ గడువు పెంచడంతో రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన ఆంక్షలు కూడా కొనసాగుతాయి. ఈ మేరకు 'రాష్ట్రవ్యాప్తంగా జిల్లా రిజిస్ట్రార్లు ఈ విషయంలో తదుపరి చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలి' ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్

TO-DAY TELANGANA Telugu News Paper
నేడు తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# ఓం బిర్లాతో భేటీ తర్వాతే అవిశ్వాస తీర్మానంపై తుది నిర్ణయం: విపక్షాలు

**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో భేటీ అయిన తర్వాతనే, ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలా వద్దా అనే విషయంపై తుది నిర్ణయం తీసుకోవాలని ప్రతిపక్షాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫ్లోర్ లీడర్స్ సమావేశంలో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. తమ అభ్యంతరాలపై ప్రభుత్వం స్పందించే తీరును బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవాలని విపక్ష కూటమి భావిస్తున్నట్లు సమాచారం.రాహుల్‌కు అవకాశం ఇస్తే!సోమ వారమే కాంగ్రెస్ ఎంపీలు, లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేశారు. ఈ తీర్మానా నికి సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ), డీఎంకే మద్దతు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మాత్రం ఈ నోటీసుపై సంతకం చేయలేదు. ఇక్కడ ఆసక్తికర విషయం ఏమిటంటే, రాహుల్ గాంధీ కూడా దీనిపై ఇంకా సంతకం చేయలేదని తెలుస్తోం ది.కాగా, లోక్ సభ సజావుగా సాగేలా చర్చించేందుకు స్పీకర్ ఓం బిర్లా మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రతిపక్ష నేతలను



సమావేశానికి ఆహ్వానించారు. ఈ భేటీ అనంతరం రాహుల్‌కు మాట్లాడే అవకాశం ఇస్తే వెనక్కు తగ్గాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. లేనిపక్షంలో మధ్యాహ్నం 1 గంటకు లోక్‌సభ సెక్రటరీ జనరల్ అత్పల్ కుమార్ సింగ్‌కు నోటీసు అందజేయాలని విపక్షాలు భావిస్తున్నాయి.ఇంతకీ ఏం జరిగిందిరాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడాల్సి ఉంది. అయితే ఆయన 2020లో చైనాతో జరిగిన ఘర్షణపై భారత్ మాజీ సైన్యాధిపతి ఎంఎం నరవణె రాసిన పుస్తకంలోని అంశాలను ప్రస్తావించడానికి ప్రయత్నించారు. దీనితో ఇంకా అధికారికంగా ప్రచురించని పుస్తకంలోని అంశాలను సభలో చెప్పకూడదంటూ స్పీకర్? రూలింగ్ ఇచ్చారు. దీనిలో ప్రధాన ప్రతిపక్ష నేతను మాట్లాడకుండా స్పీకర్ అడ్డుకుంటున్నారని, ఆయనపై మోదీ సర్కార్ ఒత్తిడి ఉందంటూ ప్రధానులపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీలను వదిలేసి, 8 మంది ఇండియా కూటమి ఎంపీలను సస్పెండ్ చేశారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధారమైన ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని సోమవారం ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. రాజ్యాంగంలోని అధికరణ 94సీ కింద ఈ నోటీసు ఇవ్వాలని నిర్ణయించినట్లు, దీనిపై ఇప్పటికే 100 మందికిపైగా ఎంపీలు సంతకాలు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# బాబ్రీ పునర్నిర్మాణం అసాధ్యం: యోగి ఆదిత్యనాథ్


**బారాబంకి:** అయోధ్యలో బాబ్రీ మసీదు పునర్నిర్మాణం అసాధ్యమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ (స్పష్టం చేశారు. బారాబంకిలోని శ్రీరామ్ జానకి ఆలయంలో మంగళవారంనాడు జరిగిన 10వ శ్రీ హనుమాన్ విరాట్ మహాయజ్ఞం, శ్రీ రామార్చా పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొందరు అవకాశవాదులు ఉంటారని, వారికి కష్టాలు వచ్చినప్పుడే రాముడు గుర్తుకు వస్తాడని, ఇతర సమయాల్లో తలవను కూడా తలవరని



అన్నారు. అందువల్లే రాముడు కూడా వాళ్లను మరిచిపోతాడని చెప్పారు. 'రాముని భక్తులపై బుల్లెట్లు కురిపించి, రాముడి సేవకు అవాంతరాలు కల్పించే రామద్రోహులకు ఇక్కడ చోటులేదు. బాబ్రీ మసీదును పునర్నిర్మిస్తామని కలలు కంటున్న వారికి ఒకటే చెప్పదలచుకున్నారు. అలాంటి తీర్పుదినం (ఖయామత్) ఎప్పటికీ రాదు' అని స్పష్టం చేశారు.'ఖయామత్ రోజు ఒకటి వస్తుందంటూ ఎదురుచూపులు చూస్తూ జీవితం గడిపేయవద్దు. హిందూస్థాన్‌లో కలిసి జీవించడం నేర్చుకోవాలి. ఈ ధరత్రి చట్టాలను గౌరవించాలి. మీరు చట్టాన్ని గౌరవించి, ఆ ప్రకారం నడుచుకుంటే లబ్ధి పొందుతారు. లేదంటే మార్గం చాలా స్పష్టంగా ఉంది. చట్టాన్ని ధిక్కరించి ముందుకు వెళ్లే వాళ్లు నరకానికే వెళ్తారు. చట్టాన్ని ధిక్కరించగలమని ఎవరైనా అనుకున్నా, స్వర్గానికి వెళ్తామని అనుకున్నా వారి కలలు ఎప్పటికీ కల్లలుగానే మిగిలిపోతాయి' అని యోగి పేర్కొన్నారు.

# ఎంఎం నరవణె పుస్తకం ప్రచురితం కాలేదు- అనధికారిక కాపీలు ప్రచారంలో ఉన్నాయి : పెంగ్విన్ ర్యాండమ్ హౌస్

**న్యూఢిల్లీ:** భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకంద్ నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ" పుస్తకం ఇప్పటికి వరకు ప్రచుతరితం కాలేదని పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా వెల్లడించింది. ఆ పుస్తకం ప్రచురణ హక్కులు తామే కలిగి ఉన్నామని, అది ముద్రితంగానూ, డిజిటల్ రూపంలోనూ విడుదల కాలేదని స్పష్టం చేసింది. నరవణె పుస్తక కాఫీలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయని వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ వివరణ ఇస్తూ ఒక ప్రకటనను విడుదల చేసింది.'జనరల్ మనోజ్ ముకుంద్ నరవణే గారి పుస్తకం 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టిని'కి పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా మాత్రమే ప్రచురణ హక్కులు కలిగి ఉంది. ఈ పుస్తకం ఇప్పటివరకు ప్రచురణలోకి వెళ్లలేదని స్పష్టంగా తెలియజేస్తున్నాం. మా సంస్థ ద్వారా ఎలాంటి కాపీ ప్రింట్ లేదా డిజిటల్ అయినా ప్రచురించబడలేదు. అలాగే పంపిణీ లేదా అమ్మకానికి ప్రజలకు అందుబాటులో ఉంచలేదు. ప్రస్తుతం ఎక్కడైనా ఈ పుస్తకానికి సంబంధించిన పూర్తి లేదా భాగస్వామ్య కాపీలు, ముద్రిత రూపంలో, పీడీఎఫ్‌గా, లేదా ఆన్‌లైన్‌లో చలామణిలో ఉంటే అవి పీఆర్?హెచ్?ఐ కాపీరైట్ ఉల్లంఘనగా పరిగణిస్తాం అలాంటి ప్రసారం వెంటనే నిలిపివేయాలి. అనధికారిక ప్రచారంలో ఉన్న కాపీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ప్రకటనలో




పేర్కొంది.దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్అయితే సోషల్ మీడియాలో ఈ పుస్తకం సంబంధించిన కాపీలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై సోమవారం దిల్లీ పోలీసులు ఎఫ్?ఐఆర్ నమోదు చేశారు. సంబంధిత అధికారుల అనుమతి లేకుండానే ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం సోషల్ మీడియా వేదికలు, ఆన్‌లైన్ వార్తా సంస్థల ద్వారా ప్రచారంలో ఉండటాన్ని దిల్లీ పోలీసులు పరిగణనలోకి తీసుకున్నట్లు అధికారిక ప్రకటనను విడుదల చేశారు. ఈ పుస్తక ప్రచురణకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి ఇంకా లభించాల్సి ఉందని కూడా తమ దృష్టికి వచ్చిందని పోలీసులు చెప్పారు.ఈ విషయంపై విచారణ జరపగా పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రచురణకు ముందు పీడీఎఫ్ ప్రతి కొన్ని వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉందని తేలిందని పోలీసులు తెలిపారు. కొన్ని మార్కెటింగ్ వేదికలు ఈ పుస్తకానికి సంబంధించిన కవర్ పేజీని కూడా ప్రదర్శిస్తూ పుస్తకం కొనుగోలుకు అందుబాటులో ఉందన్న భావన కలిగిస్తున్నాయని పోలీసులు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసిందని చెప్పారు. ఈ వ్యవహారంపై పూర్తిగా దర్యాప్తు జరుపుతామని స్పష్టం చేసింది.లోక్‌సభలో రచ్చగత వారం లోక్‌సభలో నరవణె వెల్లడించిన వివరాలపై లోక్‌సభలో గత వారం భారీ స్థాయిలో రచ్చ జరిగింది. గత వారం పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఈ పుస్తకానికి సంబంధించినట్లు భావిస్తున్న ఒక కాపీని చూపించారు. ఫిబ్రవరి 2 నుంచి లోక్‌సభలో దీని గురించి ప్రస్తావించేందుకు రాహుల్ గాంధీ ప్రయత్నించారు. పుస్తకాన్ని మోదీకే అందిస్తానంటూ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ దాని ప్రతిని సభకు తీసుకొచ్చారు. అయితే చైనా దళాలతో భారత బలగాల ఘర్షణకు సంబంధించి వివాదాస్పద విషయాలు వెల్లడించిన ఈ పుస్తకం ఇంకా ప్రచురణకే నోచుకోలేదని లోక్‌సభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇంకా ప్రచురణకు నోచుకోని పుస్తకంలోని విషయాలను సభలో ప్రస్తావించడానికి వీల్లేదంటూ రాహుల్ గాంధీ మాట్లాడేందుకు స్పీకరు అనుమతించలేదు.

# పార్లమెంట్‌లో ప్రతిపక్షాల తీరుచూసి దేశం సిగ్గుపడుతోంది

**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష పార్టీలు హద్దులు దాటి ప్రవర్తిస్తున్నాయని, పార్లమెంట్ లో జరుగుతున్న పరిణామాలను చూసి దేశం సిగ్గుపడుతోందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన ఆమె విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. (సోమవారం) లోక్‌సభ లో రాహుల్ గాంధీ . ఆర్మీ మాజీ చీఫ్ నరవణే ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను చట్టవిరుద్ధంగా ప్రస్తావించారని కంగనా



ఆరోపించారు.'రాహుల్ గాంధీ నిన్న ఒక అనధికారిక, చట్టవిరుద్ధమైన పుస్తకాన్ని సభకు తీసుకొచ్చి మొత్తం న్యాయవ్యవస్థను అవమానించారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ కూడా స్పష్టంచేసింది' అని కంగనా అన్నారు. ఈ పరిణామాలతో ప్రతిపక్ష పార్టీ సభ్యులు కూడా ఇబ్బంది పడుతున్నారని ఆమె వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని విపక్షాలు కుట్ర చేస్తున్నాయని కంగనా ఆరోపించారు.'ప్రతిపక్ష ఎంపీలు సభలో కాగితాలు చించి స్పీకర్‌పై విసరడం, టేబుళ్లపైకి ఎక్కడం లాంటివి చేస్తున్నారు. ఇలాంటి వాళ్లు ప్రధాని మోదీ చేతిలో నుంచి కాగితాలు లాక్కోరని, ఆయనపై దాడి చేయరని గ్యారెంటీ ఏంటి..? ప్రధాని సభకు రావాలంటే మాకు దీనిపై హామీ కావాలి' అని ఆమె డిమాండ్ చేశారు. మహిళా ఎంపీలను అడ్డుపెట్టుకుని ఇలాంటి చర్యలకు పాల్పడితే పార్లమెంట్ గౌరవం ఏమవుతుందని ప్రశ్నించారు.కేంద్ర బడ్జెట్‌పై చర్చ జరగనీయకుండా విపక్షాలు సభలో గందరగోళం సృష్టించడంతో లోక్‌సభ మంగళవారం కూడా వాయిదా పడింది. 'మాకు న్యాయం కావాలి' అంటూ కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేయగా, బడ్జెట్‌పై చర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వారిని కోరారు.

# నెహ్రూ నిర్మించిన పార్లమెంటరీ వ్యవస్థ ఇప్పుడు పూర్వ వైభవాన్ని కోల్పోయింది

**న్యూఢిల్లీ:** నెహ్రూ నిర్మించిన పార్లమెంటరీ వ్యవస్థ ఇప్పుడు తన పూర్వ వైభవాన్ని కోల్పోయి, వెలవెలబోతోందని కాంగ్రెస్ విమర్శించింది. 1954లో అప్పటి స్పీకర్ తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా, ప్రతిపక్షాలకు ఎక్కువ సమయం కేటాయించాలని ఆనాటి ప్రధాని జవహర్?లాల్ నెహ్రూ చెప్పిన ఉదంతాన్ని కాంగ్రెస్ గుర్తు చేసింది. చర్చలు చేయడం, ప్రతిపక్షాలు చెప్పింది వినడం, సయోధ్య కుదర్చడం మొదలైన వాటి ద్వారా నెహ్రూ నిర్మించిన పార్లమెంట్ వ్యవస్థ, ప్రస్తుతం తన పూర్వ వైభవాన్ని కోల్పోయిందని, మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కార్‌పై విమర్శలు గుప్పించింది.గత గురువారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ పెట్టారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని, ఇతర ప్రతిపక్ష నేతలను కానీ మాట్లాడనివ్వకుండా స్పీకర్ అడ్డుకున్నారని విపక్షాలు ఆరోపించాయి. అలాగే స్పీకర్ ఓం బిర్లా, మాజీ ప్రధానులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీలను విడిచిపెట్టి, 8 మంది ఇండియా కూటమి ఎంపీలను సస్పెండ్ చేశారని నిరసన వ్యక్తం చేశాయి. ఇప్పుడు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచన చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ సోషల్ మీడియా వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 1954 డిసెంబర్ 18 నాటి లోక్‌సభ చర్చల వివరాలను ఎక్స్‌లో పోస్టు చేశారు. అందులో



ఆనాటి స్పీకర్? జీ.వీ.మౌలాంకర్ తొలగింపు తీర్మానంపై ఎలా చర్చ జరిగిందో ఆయన వివరించారు. ఆనాటి చర్చలకు సంబంధించిన ఓ స్క్రీన్‌షాట్‌లను కూడా ఆయన జతచేశారు."1954లో ఆనాటి లోక్‌సభ స్పీకర్ జీ.వీ.మౌలాంకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. దీనిపై చర్చ కోసం డిప్యూటీ స్పీకర్? 2 గంటల సమయం కేటాయించారు. అప్పుడు ఆనాడి భారత ప్రధాని జవహర్?లాల్ నెహ్రూ జోక్యం చేసుకుని, 'అధ్యక్షా, ఈ ప్రత్యేక సమయంలో ప్రభుత్వం కంటే ప్రతిపక్షానికే ఎక్కువ సమయం ఇవ్వాలని నేను కోరుతున్నాను. మావైపు ఉన్న గౌరవ సభ్యులు చర్చల కోసం ఎక్కువ సమయం తీసుకోకూడదని నేను ఆశిస్తున్నాను. మేము చెప్పాల్సింది చెబుతాం కానీ, ప్రతిపక్షాలకే ఎక్కువ సమయం దక్కాలి' అని సభను కోరారు. అప్పట్లో లోక్‌సభలో మొత్తం 489 స్థానాలు ఉండగా, అందులో కాంగ్రెస్ పార్టీకి 364 సీట్లు ఉండేవి. ఆనాడు కనీసం గుర్తించబడిన ప్రతిపక్ష నాయకుడు కూడా లేరు. కానీ నాటి ప్రధాని నెహ్రూ పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించే, ప్రజాస్వామ్య దృక్పథం ఉండేది. నెహ్రూ స్వయంగా సభలో కూర్చొని, ప్రసంగిస్తూ, ఇతరులు చెప్పేది వింటూ, అందరినీ కలుపుకునిపోతూ నిర్మించిన ఆ పార్లమెంట్, నేడు తన అసలు స్వరూపాన్ని కోల్పోయి, వెలవెలబోతోంది."– జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎక్స్ పోస్ట్ఇంతకీ ఏం జరిగిందిగత గురువారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్? సభలో చర్చ ప్రారంభించారు. అయితే దీనిపై సమాధానం ఇచ్చేందుకు రావద్దని ప్రధాని మోదీని తాను కోరానని లోక్?సభ స్పీకర్? ఓం బిర్లా అన్నారు. ఎందుకంటే,దాడి చేస్తారనడం పచ్చి అబద్ధం. ప్రధాని స్పీకర్ వెనుక దాక్కుంటున్నారని' విమర్శించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఆయనకు లేఖ రాశారు. ఈ లేఖలో ప్రియాంక గాంధీ, జ్యోతిమణి, ఆర్ సుధా, వర్షా గైక్వాడ్, జ్యోత్స్న మహంత్ తదితరులు సంతకాలు చేశారు. ప్రస్తుతం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం జరుగుతోందని, త్వరలోనే లోక్‌సభలో దీనిపై నోటీసు ఇవ్వనున్నారని సమచారం.

# మణిపుర్‌లో మళ్లీ చెలరేగిన హింస



**ఇంఫాల్:** మణిపుర్‌లోని ఉఖ్రుల్ జిల్లాలో మంగళవారం ఉదయం మళ్లీ హింసాకాండ చెలరేగింది. గత శనివారం రాత్రి టాంగ్‌ఖుల్ నాగ కమ్యూనిటీకి చెందిన ఒక వ్యక్తిపై కొందరు దాడి చేశారనే ఆరోపణలతో మొదలైన వివాదం క్రమంగా పెద్దఎత్తున హింసకు దారి తీసింది. వందలాది మంది టాంగ్‌ఖుల్ గ్రామస్థులు, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు ఇళ్లు వదిలి కాంగ్పోక్పి, ఉఖ్రుల్ జిల్లాలోని సురక్షిత ప్రాంతాలకు.. రెండ్రోజులుగా తరలిపోతున్నారు. ఈ క్రమంలో ఉఖ్రుల్ జిల్లాలో తాజాగా హింస చెలరేగింది. నాగాలు వదలివెళ్లిన ఇళ్లకు కొందరు నిప్పు పెట్టారని, కాల్పులు చోటుచేసుకున్నాయని పోలీసులు తెలిపారు.ఖ్రుల్, కాంజోంగ్ జిల్లాల్లో కుకీల కదలికలపై రెండు నాగా సంస్థలు ఆంక్షలు విధించిన నేపథ్యంలో లిటాన్ సారేఖాంగ్‌లో కాల్పులు, ఇళ్లకు నిప్పుపెట్టడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. కొందరు సాయుధులు.. నాగాలు విడిచివెళ్లిన ఇళ్లకు నిప్పుపెట్టి, కాల్పులు జరిపారని, పరిస్థితి ఉద్రిక్తంగానే ఉందని ఓ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు అదనపు సాయుధ బలగాలను ఆ ప్రాంతంలో మోహరించినట్టు చెప్పారు.కాగా, ముందు జాగ్రత్త చర్యగా ఉఖ్రుల్ జిల్లా రెవెన్యూ పరిధిలో బ్రాడ్‌బ్యాండ్, వీపీఎన్, వీసాట్ సహా ఇంటర్నెట్ సర్వీసులను 5 రోజుల పాటు మణిపుర్ ప్రభుత్వం నిలిపివేసింది. సాయుధుల హింసాకాండలో ఇప్పటివరకూ మొత్తం 21 ఇళ్లు దగ్ధమైనట్టు మంత్రి గోవిందాస్ కొంతౌజం తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగానే ఉందని, శాంతియుత పరిస్థితులు నెలకొల్పేందుకు అదనపు బలగాలను పంపామన్నారు.

# కాంగ్రెస్ నేతలపై సీఎం హిమంత బిశ్వ శర్మ రూ.500 కోట్ల దావా

**అసోం :** అసోం కాంగ్రెస్ చీఫ్ గౌరవ్ గొగొయ్ సహా ఇతర నేతలపై రూ. 500 కోట్లు పరువు నష్టం దావా వేశారు ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ. కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలు దురుద్దేశంతో కూడినవని విమర్శించారు. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేతలు జితేంద్ర సింగ్, భూపేశ్ బఘేల్, గౌరవ్ గొగొయ్‌పై పరువు నష్టం దావా వేసినట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. "మీడియా సమావేశంలో నాపై తప్పుడు, దురుద్దేశపూరిత పరువు నష్టం కలిగించే ఆరోపణలు చేసినం దుకు కాంగ్రెస్ నాయకులు జితేంద్ర సింగ్, భూపేశ్ బఘేల్, గౌరవ్ గొగోయ్‌లపై రూ. 500 కోట్ల నష్టపరిహారం కోరుతూ నేను పరువు నష్టం కేసు దాఖలు చేశాను" అని శర్మ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.ఫిబ్రవరి 4న గువాహటిలో జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రసంగించిన అసోం కాంగ్రెస్ అధ్యక్షుడు గొగొయ్ సహా కాంగ్రెస్ నేతలు సీఎం హిమంతపై తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీ చేపట్టిన దర్యాప్తులో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4వేల



ఎకరాల భూమిని ముఖ్యమంత్రి, ఆయన కుటుంబం ఆక్రమించుకున్నారని వెల్లడైందని విమర్శించారు. ఈ కాంగ్రెస్ నాయకులు సంయుక్తంగా కలిసి అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.ఈ క్రమంలోనే మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ, వెబ్‌సైట్‌లో ముఖ్యమంత్రి ఆస్తులు, భూమి ఆస్తులు, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన సమాచారం ఉందన్నారు. బహిరంగంగా అందుబాటులో ఉన్న రికార్డులు, ఎన్నికల అఫిడవిట్లు, పత్రాల ఆధారంగానే పోర్టల్‌లో పెట్టామని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా సీఎం హిమంత బిశ్వ శర్మ ఆస్తుల ప్రకటనల్లో తీవ్రమైన అసమానతలు ఉన్నాయని ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్? బఘేల్ ఆరోపించారు. ఇవి పారదర్శకత, జవాబుదారీతనం గురించి ప్రశ్నలను లేవనెత్తాయని విమర్శించారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచడానికి ఈ వెబ్‌సైట్ ప్రారంభించామని తెలిపారు.'గాంధీ కుటుంబ బానిసలు చేసే దష్ప్రచారానికి భయపడను'అటు కాంగ్రెస్ నేతల ఆరోపణలపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేతలపై చట్ట ప్రకారం పరువు నష్టం దావా వేస్తానని ఆరోజే ప్రకటించారు.

# ఆ టారిఫ్స్ డబ్బును భారత్‌కు తిరిగి చెల్లించనున్న అమెరికా!

**అమెరికా :** ఇటీవలే భారత్, అమెరికా దేశాలు మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. అంతకుముందు, ఫిబ్రవరి 6న భారత్‌పై సుంకాలను తగ్గిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఈ ఆదేశాలు పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చే లోపు భారత్ నుంచి యూఎస్ కస్టమ్స్ శాఖ తీసుకున్న సుంకాల డబ్బును అమెరికా రీఫండ్ చేసే యోచనలో ఉన్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయిభారత్‌పై సుంకాలను తగ్గిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫిబ్రవరి 6 కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేశారు. అమెరికా కాలమానం ప్రకారం, ఫిబ్రవరి 7 నుంచి ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కొత్త సుంకాలు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చేందుకు కొంత సమయం పట్టింది. ఈలోపు అక్కడి అధికారులు భారత్ నుంచి వచ్చే దిగుమతులపై అధిక సుంకాలను విధించారు. ఇలా పుచ్చుకున్న మొత్తాల్లో కొంత మేరకు భారత్‌కు తిరిగివ్వాలని అమెరికా యంత్రాంగం యోచిస్తోంది. అయితే, అధ్యక్షుడు ట్రంప్ ఉత్తర్వులు రాకమునుపు విధించిన సుంకాలపై మాత్రం ఎలాంటి రీఫండ్‌లు ఉండవని సంబంధిత వర్గాలు స్పష్టం చేశాయి.మధ్యంతర ఒప్పందంలో భాగంగా భారత్‌పై విధించిన ప్రతీకార సుంకాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్టు కూడా అమెరికా పేర్కొంది. ఇక రీఫండ్స్‌పై మరింత స్పష్టతనిచ్చేలా అమెరికా కస్టమ్స్ శాఖ మరికొన్ని రోజుల్లో సవివరమైన మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# ఎన్నికలంటే...డబ్బునోళ్ల దందా !

ఎన్నికల్లో ప్రలోభాల పర్వంతో తెలంగాణ పల్లెల నుంచి పట్టణాల దాకా మత్తులో జోగుతున్నాయి. మొన్నటి కి మొన్న పంచాయితీ పోరు ముగిసింది. ఇప్పుడు పట్టణపోరు జరుగుతోంది. డబ్బున్న అభ్యర్థలదే హవా. డబ్బులు లేని అభ్యర్థులను ప్రజలు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. అతను ఎందుకు ఖర్చు పెడుతున్నాడో అర్థం చేసుకోవడం లేదు. ఎందుకు ప్రలోభ పెడుతున్నాడో గ్రహించడం లేదు. ఇప్పుడు పెట్టిన డబ్బు రేపు ప్రతి చిన్న పనికీ ముక్కుపిండి వసూలు చేస్తాడని గుర్తించడం లేదు. ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నాయకులకన్నా ప్రజలకు ఎక్కువ సంతోషంగా ఉంది. పండగ చేసుకుంటున్నారు. ఇంట్లో వంటావార్పులు అంతంత మాత్రమే. రోజుకు ఎవరో ఒకరు రావడం సాయంత్రానికి దావత్ ఇవ్వడం పరిపాటిగా మారింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గత వారం రోజులుగా ఇదే తంతు సాగింది. చివరకు బుధవారం ఎన్నికలు ఉండగా సాయంత్రం కూడా దావత్‌లకు టైమ్ కేటాయించారు. తాగుడు అలవాటు ఉన్నవారికి తాగినంత...తిండి అలవాటున్న వారికి తిన్నంత అన్న లెక్కన సాగడం ప్రజాస్వామ్య పరిహాసాని కి ఎన్నికలు పరాకాష్టగా నిలుస్తున్నాయి. సోమవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. ప్రలోభాలకు తెర లేచింది. మద్యం, మాంసంతో పాటు ఇతరత్రా కానుకల పంపిణీ ప్రారంభమైంది. పది రోజుల పాటు హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం సోమవారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. ఆ వెంటనే కొందరు అభ్యర్థులు ఓటర్లపై తాయిలాలు వెదజల్లడం ప్రారంభించారు. కొన్నిచోట్ల ఓ పార్టీ నేతలు ఇంటింటికీ చికెన్ పొట్లాలు పంపించారు. మరో అభ్యర్థి తన వార్డు పరిధిలోని ఓటర్లకు హారతి ప్లేటు పంపిణీ చేసారు. నామినేషన్ల పర్వం ముగిసిన వెంటనే ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. దాదాపు పది రోజుల పాటు ప్రచారంతో హోరెత్తించాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. పట్టణాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం చేశారు. వందల మందిని వెంటేసుకుని గల్లీగల్లీ చుట్టేశారు. పార్టీల నేతలు వార్డుల వారీగా బాధ్యతలు పంచుకుని ఇంటింటికీ తిరిగారు. ప్రచార పర్వం ముగియడంతో అన్ని పార్టీల నేతలు ప్రలోభాలకు తెర లేపారు. ఉదయమే పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో విచ్చలవిడిగా తాయిలాలు వెదజల్లాయి. చికెన్ వద్దు అన్నవారికి అరకిలో మటన్‌ను పంపించారు. గత రెండ్రోజులుగా మద్యం సీసాలు, కూల్‌డ్రింక్‌లు సరఫరా చేశారు. వీటికి అదనంగా రాత్రిపూట డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు ప్రజలు చెవులు కొరుక్కున్నారు. ఒక్కో ఓటుకు రూ.1500 నుంచి రూ.3 వేలు ఇచ్చినట్లు సమాచారం. కొన్ని పట్టణాల్లో ఖరీదు కూడా పెంచారు. డివిజన్లు, వార్డుల్లో మద్యం ఏరులై పారుతుండగా, మరోపక్క డబ్బుల పంపకాలు జోరందుకున్నాయి. ఇక, ప్రత్యర్థి ఎంత పంచుతున్నాడు.. అని అంచనా వేస్తూ అంతకుమించి ఓటర్లను ఇవ్వటానికి ఎత్తులు వేయడంలో అభ్యర్థులు తలమునకల య్యారు. ఇలా యథేచ్ఛగా పంపకాలు జరుగుతున్నప్పటికీ అధికారుల దృష్టిలో మాత్రం పడలేదు. అయితే పరస్పరం ఆయా పార్టీల వారు మా÷-తరం ఆరోపణలు చేసుకున్నారు. ఫలానా పార్టీవారు డబ్బులు పంచుతున్నారంటూ నిందలు వేసారు. స్థానిక నేతల అండతో విచ్చలవిడిగా మద్యం, డబ్బులను పంపిణీ చేస్తుంటే, పోలీసులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ఒక ఎత్తయితే...ప్రత్యర్థి పార్టీల్లో నాయకులకు డబ్బు, మద్యం ఎరగా వేసి ఎన్నికల్లో గెలుపుకోసం మార్గాలు తయారు చేసుకుంటున్నారు. కోవర్టులను ఏర్పాట్లు చేసుకుని వారి ఎత్తులను చిత్తు చేయడానికి అభ్యర్థులు డబ్బులు ఆశ చూపుతు న్నారని సమాచారం. ప్రత్యర్థి అభ్యర్థితో ఉండే ముఖ్యమైన నాయకులు పార్టీ మారకున్నా సమాచారం చేరవేసి వారి ఓటమికి కృషి చేసే వారికి రూ. 50000 నుంచి రూ.లక్ష వరకు ముట్ట చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఓటర్లనే కాకుండా ప్రత్యర్థి పార్టీల నాయకులను




కూడా ప్రలోభాలకు గురి చేసి పార్టీలు మారడానికి వ్యూహాలు రచిస్తున్నారని తెలిసింది. మొత్తంగా మునిసిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగించారు. వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గెలుపు టెన్షన్‌తో పాటు చైర్మన్ సీటు దక్కుతుందా అనే ఉత్కంఠలో ఉన్నారు. ప్రధాన పార్టీలు చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల ప్రచారంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో పురపాలికల్లో చైర్మన్ సీటుపై ఆశతో ఆశావహులు భారీగా ఖర్చు పెట్టారు. తన గెలుపుతో పాటు తన పార్టీకి చెందిన వార్డు సభ్యుల గెలుపుకు కూడా వారి భుజస్కంధాలపై వేసుకున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా ఆశావహులు అన్నితామై వ్యవహరించారు. అయితే ఇన్నీ చేసిన చివరికి పార్టీకి మెజార్టీ సీట్లు వస్తాయా.. తానే పార్టీ అభ్యర్థిని అవుతానా అనే టెన్షన్‌లో ఆశావహులు ఉన్నారు. ఏదిఏమైనా ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎత్తులు, పైఎత్తులు పూర్తయ్యాయి. ప్రజలు ఎవరిని ఆదరిస్తారాఓ చూడాలి. గత సర్పంచ్ ఎన్నికల్లో డబ్బులు తీసుకుని ఓటేయలేదని నిలదీసారు. తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని నడిబజారులు పసుపుబియ్యంతో తిరిగారు. ఈ ఎన్నికల్లో అలాంటి విచిత్రాలు ఇంకా ఎన్ని చూడాల్సి వస్తుందో. ఓటర్ల మనసు ఎలా ఉం టుందో వేచి చూడాలి.

## ఇప్పడ కెనడా వంతు వచ్చింది



### ● ఇరుదేశాల మధ్య వంతెనపై ట్రంప్ పేచీ

**వాషింగ్టన్,ఫిబ్రవరి10:** కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ను అమెరికాలోని మిచిగాన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెన ను బ్లాక్ చేస్తామని బెదిరించారు. 2014 లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి కావల్సిన మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ విమర్శించారు. వంతెన నిర్మాణానికి అయిన ఖర్చులో సగమైనా అమెరికాకు చెల్లించాలని, లేదా వంతెనపై ఇరుదేశాలకు సమాన యాజమాన్య హక్కులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కెనడాకు సూచించారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో ఇరుదేశాల మధ్య ఇటీవల తలెత్తిన విభేదాల గురించి ట్రంప్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తమ దేశం నుంచి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి కెనడా వసూలు చేస్తున్న సుంకాలు ఆమోదయోగ్యమైన రీతిలో లేవని ట్రంప్ మండిపడ్డారు. అమెరికాను కాదని చైనాతో వ్యాపారం చేసేందుకు ఆ దేశం మొగ్గు చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి వారు మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. వంతెన ప్రాజెక్టుకు సంబంధించిన వెబ్‌సైట్ ప్రకారం.. డెట్రాయిట్ నదిపై ఏర్పాటుచేసిన గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను కెనడియన్ ప్రభుత్వానికి చెందిన విండ్సర్–డెట్రాయిట్ బ్రిడ్జ్ అథారిటీ అనే సంస్థ నిర్మించింది. దీనికి అక్కడి ప్రభుత్వమే నిధులు సమకూర్చింది. ఈ ఏడాదిలో దీనిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు చేయడం గమనార్హం. అయితే ట్రంప్ ప్రకటనపై కెనడా ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం



### ● సిట్ విచారణతో రంగంలోకి దిగిన ఇడి

**తిరుమల,ఫిబ్రవరి10:** శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీ ఆర్థిక అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగినట్లు సిట్ విచారణలో తేలడంతో పీఎంఎల్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో వందలాది కోట్లు చేతులు మారడంపై ఈడీ విచారణ జరపనుంది. అలాగే, మనీ ట్రయల్‌పైనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దృష్టిసారించనున్నారు. కాగా, 2019 నుంచి 2024 వరకు టీటీడీకి సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేల్చింది. ఈ నెయ్యి విలువ సుమారు రూ. 235 కోట్లుగా అంచనా. నెయ్యి కల్తీ వ్యవహారంలో విచారణ ముగించిన సిట్.. ఛార్జ్‌షీట్‌లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వారిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు ఉన్నారు. టెండర్లలో అక్రమాలు, హవాలా మార్గాల ద్వారా లంచాలు, అక్రమ లావాదేవీలు జరిగినట్లు విచారణలో బయటపడింది. ఈ క్రమంలో ఆర్థిక అక్రమాలు, నిధుల మళ్లింపుపై ఈడీ విచారణ చేపట్టనుంది. ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి ఈడీ.. త్వరలోనే నోటీసులు జారీ చేసి విచారించనున్నట్లు సమాచారం.

## బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు

### ● యువత తీరుపై సజ్జన్నార్ హెచ్చరికలు

**హైదరాబాద్,ఫిబ్రవరి10:** బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న యువతకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. నగరంలో యువకులు బైక్‌పై చేస్తున్న ప్రమాదకర విన్యాసాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో సీపీ సజ్జన్నార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. వాహనాలను బాధ్యతాయుతంగా నడపాలని సూచించారు. బైక్ మీద చేసే ఈ చిత్రవిచిత్రమైన విన్యాసాలు చూడటానికి థ్రిల్లింగ్‌గా అనిపించవచ్చని.. కానీ అవి క్షణాల్లో ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడతాయని ఆయన హెచ్చరించారు. బైక్ మీద చేసే విన్యాసం.. నూరేళ్ల ఆయుష్షుకు వినాశనం అంటూ ఆయన పేర్కొన్నారు. చిన్న ప్రమాదం జరిగినా జీవితాంతం మంచానపడాల్సి వస్తుందని సీపీ అన్నారు. అంతేకాకుండా, మీ వల్ల ఇతరులు కూడా ప్రమాదాలబారిన పడొచ్చని తెలిపారు. సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం.. రోడ్డు మీద హీరోయిజం చూపించాలనే ఆశతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సజ్జనార్ సూచించారు. బైక్‌పై స్టంట్లు చేస్తూ వెనుక కూర్చున్న వ్యక్తుల ప్రాణాలను కూడా రిస్క్‌లో పెడుతున్న ఈ చర్యలు చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వాటి వల్ల కేసుల పాలై సమస్యలను కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. 'బాధ్యతగా డ్రైవ్ చేయండి' అంటూ సీపీ సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు



## మారుతీ కార్ల సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం



### భారీగా దగ్ధమైన కార్లు...పెద్ద ఎత్తున నష్టం

**హైదరాబాద్,ఫిబ్రవరి10:** హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రముఖ కార్ల కంపెనీ సర్వీస్ సెంటర్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పలు కార్లు దగ్ధమయ్యాయి. రాజేంద్రనగర్ మారుతీ సుజుకీ సర్వీస్ సెంటర్‌లో ఈ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భారీ అగ్ని ప్రమాదం కారణంగా పరిసరాల్లో దట్టమైన పొగ అలుముకుంది. ప్రమాదంలో పలు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పేశారు. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని, రెండు ్ర÷ర్ ఇంజిన్లతో మంటలను ఆర్పేశారు. ప్రమాదంలో ఆ ఎ÷–లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి.

TO-DAY TELANGANA Telugu News Paper
తెలుగు దినపత్రిక నిజం మా నైజం



# నమీబియాతో మ్యాచ్ నుంచి అభిషేక్ ఔట్

టీమిండియా తన నెక్స్ట్ మ్యాచ్‌ను నమీబియాతో ఆడనుంది. ఇప్పటికే అమెరికాపై విజయం సాధించిన భారత జట్టు.. మరో విజయంపై కన్నేసింది. అయితే, భారత జట్టు ఓపెనర్ అభిషేక్ శర్మ రెండో మ్యాచ్ ఆడడంపై అనుమానాలు వస్తున్నాయి. అందుకు గల కారణం ఓసారి చూద్దాం.. టీ20 ప్రపంచకప్ 2026 సందడి గ్రాండ్ గా మొదలైంది. అయితే, గాయాలతో చాలా జట్లు ఇబ్బంది పడుతున్నాయి. ఆస్ట్రేలియా జట్టు ఎక్కువగా ఇబ్బంది పడింది. మరోవైపు టీమిండియా కూడా ఈ గాయాలా ఎఫెక్ట్ ను ఎదుర్కొంటుంది. ఇప్పటికే వాషింగ్టన్ సుందర్, తిలక వర్మ ఇబ్బంది పడిన సంగతి తెలిసిందే. బుమ్రా కూడా అనారోగ్యంతో ఇబ్బంది పడ్డాడు. తాజాగా ఈ లిస్ట్ లో టీమిండియా డేంజరస్ ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా చేరినట్లు తెలుస్తోంది. అందుకు గల కారణం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. అయితే, అభిషేక్ శర్మ అనారోగ్యం టీమిండియాకు ఇబ్బందిగానే ఉండొచ్చు. అమెరికా జట్టు బ్యాటింగ్ చేసే సమయంలో ఈ యంగ్ డైనమేట్ మైదానంలోకి దిగలేదు. అభిషేక్ స్థానంలో శాంసన్ ఫీల్డింగ్ చేస్తూ కనిపించాడు. అంతకుముందు అభిషేక్ తొలి బంతికే డకౌట్ అయిన సంగతి తెలిసిందే. అయితే, టీమిండియా తదుపరి మ్యాచ్ గురువారం ఢిల్లీలో నమీబియాతో జరగనుంది. ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆదివారం సాయంత్రం తన నివాసంలో జట్టుకు విందు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ విందు కోసం ఆటగాళ్లు అంతా వచ్చారు. కానీ, అభిషేక్ శర్మ మాత్రం అందరికంటే ముందుగానే తిరుగుప్రయాణం అయ్యాడు. చాలా మంది సిబ్బంది ఈ యంగ్ గన్ కు వీడ్కోలు పలికేందుకు వచ్చినట్లు వీడియోలో చూడొచ్చు. ఈ క్రమంలో నమీబియాతో జరిగే తదుపరి మ్యాచ్‌కు అభిషేక్ శర్మ అందుబాటులో ఉంటాడా లేదా అనే దానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టీ20 ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లో అమెరికాను ఓడించే ఫేవరెట్‌గా టీమిండియా బరిలోకి దిగింది. కానీ, అమెరికా జట్టు గట్టి పోటీ ఇవ్వడంతో టీమిండియా కష్టపడి గెలవాల్సి వచ్చింది. ఈ మ్యాచ్ తర్వాత, మహమ్మద్ సిరాజ్ విలేకరుల సమావేశంలో పాల్గొని అభిషేక్ తీవ్రమైన జ్వరం, కడుపు నొప్పితో ఆట ఆడాడని వెల్లడించాడు. "అభిషేక్ శర్మకు కడుపు నొప్పిగా ఉంది. అందుకే అతను ఫీల్డింగ్ చేయలేదు" అని సిరాజ్ చెప్పుకొచ్చాడు.ఇప్పటికే జస్ప్రీత్ బుమ్రా కూడా జ్వరం కారణంగా అమెరికాతో జరిగిన మ్యాచ్‌కు దూరమైన సంగతి తెలిసిందే. గురువారం నమీబియాతో జరిగే మ్యాచ్‌కు ఆయన దూరమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.భారత జట్టు తన తొలి మ్యాచ్‌లో అమెరికాపై గెలిచింది. రెండో మ్యాచ్ లో నమీబియాను ఢీ కొట్టనుంది. అభిషేక్ తిరిగి మైదానంలోకి వస్తాడని సిరాజ్ నమ్మకంగా ఉన్నాడు. కానీ టీమిండియా కోచ్చ గంభీర్ మరో ప్లాన్ కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అభిషేక్ ఆరోగ్యం మెరుగుపడకపోతే సంజూ శాంసన్ ఓపెనర్ గా బరిలోకి దిగవచ్చు. ఫిబ్రవరి 15న భారత్ పాకిస్తాన్‌తో టీ20 ప్రపంచకప్ 2026లో బిగ్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఈ ఘర్షణకు అభిషేక్ వంద శాతం ఫిట్‌గా ఉంటాడని మెన్ ఇన్ బ్లూ టీం భావిస్తోంది. అంటే, నమీబియా మ్యాచ్‌కు అతనికి విశ్రాంతి ఇస్తే, సంజూ శాంసన్ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ సంజూ శాంసన్ ఈ మ్యాచ్ ఆడితే.. తదుపరి రౌండర్ కు వెళ్లే క్రమంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడానికి సహాయపడుతుంది. అంటే, నమీబియా మ్యాచ్ తో అతను బాగా రాణించాల్సి ఉంటుంది.



## మైఖేల్ లీస్క్ కొత్త రికార్డు

స్కాటిష్ క్రికెటర్ మైఖేల్ లీస్క్ 2026 ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లో చరిత్ర సృష్టించాడు. ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో విజయం సాధించింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో ఓడిపోయిన స్కాట్లాండ్.. టోర్నమెంట్‌లో తొలి విజయం నమోదు చేసింది. లీస్క్ ఆల్ రౌండ్ ఆటతో ఆకట్టుకున్నాడు. టీ20 ప్రపంచ కప్‌లో తన జట్టు తొలిసారిగా 200 పరుగుల స్కోరును చేరుకోవడంలో సహాయపడ్డాడు. ఈ బ్యాట్స్‌మన్ 5 బంతుల్లో 22 పరుగులు చేశాడు. 2 ఫోర్లు, 2 సిక్సర్లు బాదాడు. అతను 440 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. అతను 4 వికెట్లు కూడా పడగొట్టాడు. కేవలం 17 పరుగులు మాత్రమే ఇచ్చాడు. తద్వారా లీస్క్ టీ20 ప్రపంచ కప్‌లో అత్యంత వేగవంతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అది కూడా అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో దంచి కొట్టాడు. గతంలో, ఈ రికార్డు వెస్టిండీస్‌కు చెందిన డ్వేన్ స్మిత్ పేరిట ఉంది. అతను 2007లో బంగ్లాదేశ్‌పై 7 బంతుల్లో 29 పరుగులు చేశాడు. ఇంకా, భారత క్రికెటర్ యువరాజ్ సింగ్ ఇంగ్లాండ్‌పై 12 బంతుల్లో అర్ధ సెంచరీ కొట్టాడు. ఈ టీమిండియా బ్యాట్స్‌మన్ ఒక ఓవర్‌లో 6 సిక్సర్లు బాదిన సంగతి తెలిసిందే. యువరాజ్ ఇప్పుడు మూడో స్థానానికి చేరుకున్నాడు.తద్వారా లీస్క్ ఒక అసోసియేట్ దేశం నుంచి నాలుగు వికెట్లు తీసి 20 పరుగులు చేసిన మొదటి ఆటగాడిగా నిలిచాడు. లీస్క్ తన కెరీర్‌లో ఐదవసారి టీ20 ప్రపంచ కప్‌లో ఆడుతున్నాడు. గతంలో 2016, 2021, 2022, 2024 ఎడిషన్లలో ఆడాడు. ఇప్పటి వరకు 76 టీ20లు, 91 వన్డేలు ఆడాడు. లీస్క్ 2013లో అరంగేట్రం చేశాడు.ఈ మ్యాచ్ గురించి చెప్పాలంటే, స్కాట్లాండ్ మొదట బ్యాటింగ్ చేసి 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ప్రతిస్పందనగా, ఇటలీ 134 పరుగులకు ఆలౌట్ అయింది. స్కాట్లాండ్ తరపున జార్జ్ మున్సే, మైఖేల్ జోన్స్ వరుసగా 84, 37 పరుగులు అందించారు.

## రోహిత్, కోహ్లీలకు భారీ షాక్ ఇచ్చిన బీసీసీఐ



భారత క్రికెట్ నియంత్రణ మండలి 2025-26 సీజన్‌కు (అక్టోబర్ 1, 2025 నుండి సెప్టెంబర్ 30, 2026 వరకు) సంబంధించి టీమిండియా సీనియర్ పురుషులు, మహిళా క్రికెటర్ల వార్షిక కాంట్రాక్టులను సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈసారి బోర్డు తన కాంట్రాక్ట్ విధానంలో అనూహ్య మార్పులు చేస్తూ సీనియర్ ఆటగాళ్లకు షాక్ ఇచ్చింది. ఈ ఏడాది బీసీసీఐ తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం 'గ్రేడ్ ఏం' ) కేటగిరీని పూర్తిగా తొలగించడం. గత సీజన్ వరకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజాలు ఈ టాప్ గ్రేడ్‌లో ఉండేవారు. అయితే, తాజా జాబితాలో దిగ్గజ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను గ్రేడ్-బి కి తగ్గించారు. కారణం ఇదే: రోహిత్, కోహ్లీలు ఇప్పటికే టీ20 ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి, ప్రస్తుతం కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. మూడు ఫార్మాట్లలో ఆడే ప్లేయర్లకు మాత్రమే అత్యున్నత గ్రేడ్ ఇవ్వాలనే నిబంధనతో ఈ మార్పు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత కాంట్రాక్టుల్లో గ్రేడ్-ఏ అత్యున్నత కేటగిరీగా ఉంది. ఇందులో కేవలం ముగ్గురు ఆటగాళ్లకు మాత్రమే చోటు దక్కింది. టెస్టులు మరియు వన్డేలకు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ బాధ్యతలు చేపట్టిన గిల్, గ్రేడ్-బి నుండి గ్రేడ్-ఏకి ప్రమోషన్ పొందాడు. జస్ప్రీత్ బుమ్రా: స్టార్ పేసర్ బుమ్రా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.రవీంద్ర జడేజా: సీనియర్ ఆల్‌రౌండర్ జడేజా కూడా గ్రేడ్-ఏలోనే కొనసాగుతున్నారు. గ్రేడ్ల వారీగా ఆటగాళ్ల జాబితా:గ్రేడ్-బి: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్, కుల్దీప్ యాదవ్, యశస్వి జైస్వాల్, మహ్మద్ సిరాజ్, శ్రేయస్ అయ్యర్.గ్రేడ్-సి: తెలుగు ఆటగాళ్లు తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డితో పాటు అక్షర్ పటేల్, సంజు శాంసన్, రింకూ సింగ్, శివమ్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, అభిషేక్ శర్మ వంటి 16 మందికి చోటు దక్కింది.వెటరన్ పేసర్ మహ్మద్ షమీకి ఈసారి వార్షిక కాంట్రాక్టులో చోటు దక్కలేదు. మహిళా విభాగంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, దీప్తి శర్మ గ్రేడ్-ఏలో కొనసాగగా, అద్భుత ప్రదర్శన చేసిన జెమీమా రోడ్రిగ్స్ గ్రేడ్-బి నుండి గ్రేడ్-ఏకి ప్రమోషన్ పొందింది. గతేడాది 34 మందికి కాంట్రాక్టులు ఉండగా, ఈసారి ఆ సంఖ్యను 30 మందికి తగ్గించింది.

## గంభీర్, సూర్యకుమార్ విజ్ఞప్తిని తిరస్కరించిన బీసీసీఐ

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో ఆటగాళ్లకు బీసీసీఐ పెట్టిన కండిషన్స్‌ను సడలించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ చేసిన విజ్ఞప్తికి బోర్డు నిరాకరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మెగా టోర్నీ సందర్భంగా కుటుంబ సభ్యులను తమతో అనుమతించాలని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చేసిన రిక్వెస్ట్‌ను బీసీసీఐ తిరస్కరించింది. జట్టు ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టం చేసింది. గతేడాది బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ పరాజయం తర్వాత బీసీసీఐ ఆటగాళ్లకు 10 కండిషన్స్‌తో కూడిన గైడ్‌లైన్స్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ప్రధానంగా విదేశీ పర్యటనలు, సిరీస్‌ల సందర్భంగా ఆటగాళ్లతో కుటుంబ సభ్యులు ఉండటాన్ని నిషేధించింది. 45 రోజుల కంటే ఎక్కువ సాగే పర్యటనల్లోనే కుటుంబ సభ్యులను కేవలం 15 రోజులకు మాత్రమే అనుమతించింది. అయితే ఆటగాళ్లు తమ సొంత ఖర్చుతో కుటుంబ సభ్యుల ప్రయాణానికి, బసకు ఏర్పాట్లు చేసుకోవచ్చు. కానీ ఒకే హోటల్ గదిలో ఉండకూడదు. ఆటగాళ్లందరూ తప్పనిసరిగా టీమ్ బస్సులోనే ప్రయాణించాలి. లోకల్ మ్యాచ్‌లు ఉన్నా కూడా సొంత వాహనాలు వాడకూడదు. ఆటగాళ్ల వ్యక్తిగత మేనేజర్లు, ఏజెంట్లు లేదా ప్రైవేట్ చెఫ్‌లను కూడా టీమ్ హోటల్‌లోకి అనుమతించరు. మ్యాచ్‌ల మధ్య జరిగే అనధికారిక సమావేశాలకు ఆటగాళ్లందరూ తప్పనిసరిగా హాజరు కావాలి అనే నిబంధనలను బీసీసీఐ తీసుకొచ్చింది. ఓ జాతీయ ఛానెల్ రిపోర్ట్ ప్రకారం.. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా మేనేజ్‌మెంట్.. ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్ సతీమణులు, కాబోయే భార్యలను ప్రపంచకప్ సమయంలో తమతో ఉండటానికి అనుమతి కోరింది. అయితే ఈ విన్నపాన్ని బీసీసీఐ తిరస్కరించింది. అనధికారిక జట్టు సమావేశాలకు హాజరుకాకుండా కుటుంబ సభ్యులతో సమయం గడపడానికి చాలా మంది ఆటగాళ్లు ప్రాధాన్యత ఇవ్వడంతోనే ఈ నిషేధం విధించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. భారత జట్టు అన్ని స్వదేశీ మ్యాచ్‌లను ముంబై, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్, ఢిల్లీలో ఆడుతుంది. పాకిస్థాన్‌తో జరిగే ఏకైక మ్యాచ్ కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరగనుంది. ఒకవేళ నాకౌట్‌లో దాయాది జట్టుతో మళ్ళీ తలపడితే, డిఫెండింగ్ ఛాంపియన్ కొలంబోకు ప్రయాణించాల్సి ఉంటుంది.



## అప్పటిలానే పాక్‌ను ఓడిస్తాం: అమెరికా కెప్టెన్




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా పాకిస్థాన్‌తో కొలంబో వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో అమెరికా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని అమెరికా కెప్టెన్ మోనాంక్ పటేల్ తెలిపాడు. గత టీ20 ప్రపంచకప్ 2024లో పాకిస్థాన్‌ను ఓడించామని, అదే ఫలితాన్ని పునరావృతం చేసే ప్రయత్నం చేస్తామని ధీమా వ్యక్తం చేశాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. ఇది బ్యాటింగ్‌కు అనుకూలమైన ట్రాక్ లాగా కనిపిస్తోంది. ఇక్కడ నిలకడగా గాలి వీస్తోంది. కాబట్టి లక్ష్యం ఎంతో తెలిస్తే ఛేజింగ్ సులువు అవుతుంది. మా జట్టులో రెండు మార్పులు జరిగాయి. గాయంతో అలీ ఖాన్ దూరం కాగా.. ఆదిల్ వచ్చాడు. సాయి ఈ మ్యాచ్ ఆడటం లేదు. అతని స్థానంలో జహంగీర్ బరిలోకి దిగుతున్నాడు. గత మ్యాచ్‌లో మేం మంచి క్రికెట్ ఆడాం. ఆ మ్యాచ్ నుంచి చాలా సానుకూల అంశాలు ఉన్నాయి.

## ఫిబ్రవరి 15న భారత్, పాకిస్తాన్ జట్ల పోరు!



తప్పని పరిస్థితుల్లో పాకిస్తాన్ తోక ముడిచింది. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినా చివరికి తన నిర్ణయం మార్చుకోవలసి వచ్చింది. పాకిస్తాన్ ప్రభుత్వం తమ జట్టు టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడదని ఫిబ్రవరి 1న ప్రకటించింది. కొన్ని రోజుల హైడ్రామా తర్వాత, పాకిస్తాన్ జట్టు టీమిండియాతో మ్యాచ్ ఆడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదట పాక్ కి 3 కండీషన్లు పెట్టింది. అయితే ×జజ వాటిని అంగీకరించలేదు. దాంతో చివరికి పాకిస్తాన్ ప్రభుత్వం, పీసీబీ దిగి రావాల్సి వచ్చింది. ఇప్పుడు భారత్, పాకిస్తాన్ మ్యాచ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ప్రేమికులు ఎదురుచూస్తున్నారు. టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా భారత్, పాకిస్తాన్ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ ఆసియా జట్లు గ్రూప్-ఎలో ఉన్నాయి. భారత్ తన మొదటి మ్యాచ్‌లో అమెరికా (ఖూూ)ని ఓడించగా, నెదర్లాండ్స్‌తో జరిగిన తన మొదటి మ్యాచ్‌లో పాకిస్తాన్ విజయం సాధించింది. పాకిస్తాన్ నెక్ట్స్ మ్యాచ్ అమెరికాతో తలపడనుంది. భారత్ గురువారం నాడు తమ రెండో మ్యాచ్ నమీబియాతో ఆడనుంది. తమ మూడవ మ్యాచ్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు ఢీకొంటాయి. మైదానం బయట మాటల తూటాలు పేల్చుతున్న పాక్ జట్టు మ్యాచులో ఏం చేస్తుంది, ఎలాంటి ప్రదర్శన చేస్తుంది అనేది ఆసక్తికరంగా మారింది.

# బాలీవుడ్‌లోకి కిరణ్ అబ్బవరం



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో మరో భారీ అడుగు వేయబోతున్నారు. 'క' చిత్రంతో పాన్-ఇండియా స్థాయిలో తన సత్తా చాటిన కిరణ్, ఇప్పుడు బాలీవుడ్ ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా నిర్మాణంలో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు తెలుస్తుంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సాల్‌తో కలిసి ప్రేరణ అరోరా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించనుండగా, కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ సంస్కృతి మరియు పురాణాల నేపథ్యంలో సాగే ఒక అద్భుతమైన మైథాలజీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమా కోసం మేకర్స్ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించబోతున్నారు. గ్రాండ్ విజువల్స్ మరియు హై టెక్నికల్ వాల్యూస్‌తో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ చిత్రం రూపొందనుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సెప్టెంబర్ నెల నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని చిత్ర బృందం నిర్ణయించినట్లు సమాచారం. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం బాలీవుడ్ లేదా టాలీవుడ్‌కు చెందిన ఒక అగ్ర నటిని హీరోయిన్‌గా ఎంపిక చేసే ప్రక్రియలో చిత్ర యూనిట్ ఉంది. భక్తి, భావోద్వేగాలు, డ్రామా మరియు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌ల కలయికతో ఈ కథ ఉండబోతోందని, ప్రేక్షకులకు ఇది ఒక సరికొత్త దృశ్యకావ్యాన్ని అందిస్తుందని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సినిమా టైటిల్, దర్శకుడు మరియు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. 'క' సినిమా విజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కిరణ్ అబ్బవరం, ఈ గ్లోబల్ ప్రాజెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద తనదైన ముద్ర వేయాలని సిద్ధమవుతున్నారు.

# జోర్డాన్‌లో డ్రాగన్ యాక్షన్ సీన్స్ షూటింగ్



టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్-డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్' సినిమాపై అభిమానుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ జోర్డాన్‌లో జరుగుతోంది. అక్కడ ఎన్టీఆర్‌పై అత్యంత భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ యాక్షన్ ఎపిసోడ్ పూర్తయిన వెంటనే ఓ స్పెషల్ సాంగ్‌ను షూట్ చేయనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆ పాటలో ఎన్టీఆర్ స్టెప్స్‌తో పాటు హీరోయిన్ రుక్మిణీ వసంత్ గ్లామర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. ప్రశాంత్ నీల్ స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సాంగ్‌ను కూడా గ్రాండ్ లెవల్‌లో తెరకెక్కించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలిచే అవకాశముంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని యూనిట్ చెబుతోంది. ఎన్టీఆర్ కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా నిలవాలని ప్రశాంత్ నీల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడని సమాచారం. అందుకే స్క్రిప్ట్ దశలోనే ఆయన చాలా సమయం కేటాయించాడట. కథ, స్క్రీన్‌ప్లే, యాక్షన్ బ్లాక్స్ అన్నింటినీ అత్యంత జాగ్రత్తగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఆయన సంగీతం ఇప్పటికే ప్రశాంత్ నీల్ సినిమాలకు భారీ ప్లస్ పాయింట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనుండటం మరో ప్రత్యేకత. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న 'డ్రాగన్' సినిమాను ఈ ఏడాది జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

----------

# ఇప్పుడు అందరినోటా ఈ అమ్మాయి మాటే!



ఇప్పుడు అందరూ ఒక అమ్మాయిని గురించి అదేపనిగా మాట్లాడుకుంటున్నారు .. చర్చించుకుంటున్నారు. ఆ అమ్మాయి గొప్ప అందగత్తెనా అంటే కాదు. స్టార్ హీరో సరసన సందడి చేసిందా అంటే... అదీ లేదు. మరి ఎందుకు ఆ అమ్మాయిని గురించి అంతా సోషల్ మీడియాలో సెర్చ్ చేస్తున్నారు? ఆ అమ్మాయిని గురించి తెలుసుకోవడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు? అనే ఒక సందేహం కలగకుండా ఉండదు. అంతగా అందరిని ఆకట్టుకున్న ఆ అమ్మాయి పేరే అనిష్మా అనిల్ కుమార్. అనిష్మా తమిళంలో చేసిన 'సిరై' సినిమా రీసెంటుగా ఓటీటీలోకి వచ్చింది. తమిళంలో థియేటర్లవైపు నుంచి కూడా ఈ సినిమా మంచి వసూళ్లనే రాబట్టింది గానీ, తెలుగు ప్రేక్షకులకు ఆ విషయం తెలియదు. ఓటీటీలో తెలుగులోను వచ్చిన ఈ సినిమా చూసిన ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు. బలమైన కథాకథనాలతో ఈ సినిమా ఒక రేంజ్ లో ఆడియన్స్ ను ఆకట్టుకుంది. ఒక విలేజ్ నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథ, ప్రతి ఒక్కరికీ ఎమోషనల్ గా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా చూసిన వాళ్లలో చాలామంది అనిష్మా నటనకు ఎక్కువ మార్కులు ఇస్తారు. తాను ప్రేమించిన వ్యక్తి కోసం కుటుంబ సభ్యులను .. మతాన్ని .. ఊరును .. చివరికి విధిని ఎదురించి నిలిచిన పాత్రలో అనిష్మా నటన కన్నీళ్లు పెట్టిస్తుంది. ఈ మధ్య కాలంలో ఈ స్థాయి నటనతో మెప్పించినది ఈ అమ్మాయి మాత్రమేనేమో అనిపిస్తుంది. 2023లో 'పూవన్' అనే మలయాళ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన అనిష్మాకి, 'సిరై'తో గట్టి హిట్ పడిందనే చెప్పాలి. తెలుగు నుంచి ఈ అమ్మాయికి మంచి పాత్రలు వెళతాయోమో చూడాలి.

# ఖుషీ అవుతున్న కీర్తి సురేశ్ ఫ్యాన్స్!

హీరోయిన్ గా ఛాన్స్ రావడమే కష్టం .. ఇక ఆ సినిమా హిట్ కొట్టేసి స్టార్ డమ్ దక్కడం మరింత కష్టం. అయితే ఈ విషయంలో కీర్తి సురేశ్ పెద్దగా కష్టపడలేదు. చాలా తేలికగా ఆమె వరుస విజయాలను అందుకుంటూ వెళ్లింది. స్టార్ హీరోయిన్ గా చక్రం తిప్పడం మొదలుపెట్టేసింది. అయితే మొదటి నుంచి కూడా ఆమె తమిళ సినిమాలకి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వడం మనకి కనిపిస్తుంది. ఈ కారణంగా తెలుగు ప్రాజెక్టులపై పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. కీర్తి సురేశ్ ప్లానింగ్ కారణంగా తెలుగులో గ్యాప్ లేకుండా చేయలేకపోయింది. 'దసరా' తరువాత ఆమె తెలుగులో పెద్దగా సినిమాలు చేయలేకపోయింది. తమిళంలో మాత్రం ఆమె మార్కెట్ బాగానే ఉంది. తెలుగులో ఆమె ప్రాజెక్టులు .. నిర్ణయాల విషయంలో అభిమానులు మాత్రం కాస్త అసంతృప్తిగానే ఉన్నారు. ఆమె నుంచి సరైన సినిమా రాలేదనే అభిప్రాయంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె విజయ్ దేవరకొండ జోడిగా 'రౌడీ జనార్దన' సినిమాను ఒప్పేసుకుంది. విజయ్ దేవరకొండ సరసన కీర్తి సురేశ్ తొలిసారిగా చేస్తున్న సినిమా కావడంతో, ఈ ప్రాజెక్టుకి ఒక్కసారిగా బజ్ వచ్చేసింది. తెరపై ఈ జోడీ చాలా బావుంటుందని ఫ్యాన్స్ అంటున్నారు. అటు విజయ్ దేవరకొండకి .. ఇటు కీర్తి సురేశ్ కి కూడా ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ ఇస్తుందని నమ్ముతున్నారు. ఇక ఈ సినిమాలో రాజశేఖర్ ఓ కీలకమైన పాత్రను చేయనున్నారని అంటున్నారు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా, డిసెంబర్లో థియేటర్లకు వచ్చే ఛాన్స్ ఉందని చెబుతున్నారు.



# విశ్వంభరకు ప్రత్యేకంగా టైటిల్ కార్డ్స్

మెగాస్టార్ చిరంజీవి, వశిష్ట కాంబినేషన్‌లో రాబోతున్న సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టైటిల్ కార్డ్స్ విషయంలో దర్శకుడు వశిష్ట తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన 'లియో' సినిమా తర్వాత యానిమేటెడ్ టైటిల్ కార్డ్స్ వేయడం అనేది ఒక ట్రెండ్‌గా మారిపోయిందన్న సంగతి తెలిసిందే, అయితే తన సినిమా కోసం ఆ రొటీన్ ఫార్ములాను ఫాలో అవ్వడం తమకు ఇష్టం లేదని వశిష్ట క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ ట్రెండ్‌ను బ్రేక్ చేస్తూ 'విశ్వంభర' కాన్సెప్ట్‌ను ప్రతిబింబించేలా ఏకంగా ఎనిమిది రకాల ప్రత్యేకమైన మెగాస్టార్ టైటిల్ కార్డ్ డిజైన్స్‌ను చిత్ర బృందం రూపొందించినట్లు తెలుస్తుంది. పంచభూతాల నేపథ్యంలో సాగే ఈ ఫాంటసీ అడ్వెంచర్‌లో ప్రతి టైటిల్ కార్డ్ ఒక ప్రత్యేకమైన ఎలిమెంట్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయబోతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో, చిరంజీవి ఇమేజ్‌ను మరో లెవల్‌లో చూపిస్తూ ఈ కార్డ్స్ డిజైన్ చేయబడ్డాయి. కేవలం టైటిల్ కార్డ్స్ కోసమే దర్శకుడు ఇంతటి కసరత్తు చేశారంటే, వెండితెరపై సినిమా ఏ స్థాయి విజువల్ వండర్‌గా ఉండబోతుం దోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

----------------



# ఇక నుంచి అన్నపూర్ణ స్టూడియోస్ లో

# అత్యాధునిక డాల్బీ అట్మాస్ సౌండ్ మిక్సింగ్



తెలుగు సినిమా రంగానికి అత్యాధునిక సాంకేతికతను అందించే దిశగా అన్నపూర్ణ స్టూడియోస్ మరో కీలక ముందడుగు వేసింది. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాలో ఏర్పాటు చేసిన డాల్బీ అట్మాస్ 7.1.4 హెచ్‌ఈ మిక్స్ ఫెసిలిటీని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున, ఆస్కార్ విజేత, సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి ఈ నూతన సదుపాయాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున మాట్లాడుతూ, "సినిమాకు సౌండ్ ప్రాణం లాంటిది. టెక్నాలజీ మారేకొద్దీ మనం కూడా అప్‌డేట్ అవ్వాలి. అందుకే మా విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ ఫెసిలిటీని ఏర్పాటు చేశాం. ఇది వారి భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుంది" అని తెలిపారు. సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి మాట్లాడుతూ, "సౌండ్ సినిమాకి ఆత్మ వంటిది. కథలోని భావోద్వేగాలను ప్రేక్షకులకు మరింత చేరువ చేయడంలో సౌండ్ స్కేప్ కీలక పాత్ర పోషిస్తుంది. అన్నపూర్ణ స్టూడియోస్ విద్యార్థులు ఈ టెక్నాలజీని ఉపయోగించి సౌండింగ్‌లో సరికొత్త ప్రయోగాలు చేస్తారని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఈ డాల్బీ అట్మాస్ ఫెసిలిటీ, సౌండ్ డిజైన్ మరియు మిక్సింగ్‌లో అత్యున్నత స్థాయి శిక్షణకు వీలు కల్పిస్తుంది. దీని ద్వారా సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు మల్టీ-డైమెన్షనల్ ఆడియో అనుభూతిని అందించే మెళకువలను అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాలో విద్యార్థులు నేర్చుకోనున్నారు. ఈ కొత్త సదుపాయం, తెలుగు సినిమా సాంకేతిక నిపుణులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో దోహదపడుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.